
వార్త
ఆదివారం
9 అక్టోబరు, 2022
ఇల్లే కోవెల



సమంత కథానాయికగా నటిస్తున్న పౌరాణిక చిత్రం 'శాకుంతలం'. గుణశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ సంస్కృత నాటకం 'అభిజ్ఞాన శాకుంతలం' ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. శకుంతల-దుశ్యంతుడి ప్రేమకథను ఇందులో చూపించనున్నారు. దుశ్యంతుడిగా దేవ్‌మోహన్ నటించారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో నవంబర్ 4వ తేదీన భారీస్థాయిలో విడుదల చేయబోతున్నట్లు గతంలో ప్రకటించారు. తాజాగా ఈ చిత్రం విడుదల వాయిదా వేసినట్టు తెలిపారు. చిత్రాన్ని త్రీడీ రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నామని గుణశేఖర్ చెప్పారు. త్రీడీ కొంత సమయం తీసుకుంటుంది కనుక ముందుగా అనుకున్న సమయంలో చిత్రాన్ని విడుదల చేయలేమని చెప్పారు. త్వరలో కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని దర్శకుడు గుణశేఖర్ తెలిపారు.

# 'శాకుంతలం' చిత్రం విడుదల వాయిదా!



టాలీవుడ్ ఇండస్ట్రీని సుదీర్ఘ కాలం పాటు ఏలిన అందాల కథానాయికలలో కాజల్ ఒకరు. వ్యక్తిగత కారణాల వల్ల కొంత గ్యాప్ తీసుకున్న కాజల్ మళ్లీ రంగంలోకి దిగడానికి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలోనే 'పుష్ప 2' చిత్రంలో స్పెషల్ కోసం సుకుమార్ ఆమెను సంప్రదించడం, ఆమె అంగీకరించినట్లు సమాచారం.

'పుష్ప' సినిమాకి దేవిశ్రీ సంగీతం సమకూర్చారు. ఆయన ఈ సినిమాను మ్యూజికల్ హిట్‌గా నిలబెట్టాడు. ఇందులో సమంత చేసిన ఐటమ్ సాంగ్ జనంలోకి ఒక రేంజ్‌లో దూసుకుపోయింది. ఈసారి అంతకుమించిన అన్నట్టుగా 'పుష్ప 2'లో ఐటమ్ సాంగ్ దేవిశ్రీ ట్యూన్ చేశాడట. ఆ పాట కోసమే ఇప్పుడు కాజల్‌ని తీసుకున్నట్టు టాక్.

గతంలో 'జనతా గ్యారేజ్' సినిమాకి కాజల్ చేసిన ఐటమ్ సాంగ్ 'నేను పక్కా లోకల్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు 'పుష్ప 2'లో సందడి చేయనుందని తాజా సమాచారం. వచ్చే సంవత్సరం ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

తారాతీరం

# 'పుష్ప 2'లో కాజల్ స్పెషల్ సాంగ్

ఆదివారం వార్త
sunmagvaartha@gmail.com
9 అక్టోబరు, 2022

## మంచి ముత్యాలు

మనల్ని గాయపరచిన వారితో మనల్ని పోల్చుకోకపోవడమే సరియైన ప్రతీకారం

- జేన్ పోర్టర్

## విషయ విశేషం

కార్డ్‌బోర్డ్ బాక్స్‌లతో.... 4
'సంఘీ'భావం....5
ఆత్మహత్యలను నివారించలేమా!
రెండు ఖండాల మధ్య నెలకొన్న దేశం..6
కవర్ స్టోరీ..8
ఇల్లే కోవెల
కథ.. 20
మర్యాదలు
సాహిత్యం.. 23
కాళ్లకూరి వారి ముగ్ధమనోహర..
ఈవారం కవిత్వం..24
ఓడిన అల
పిల్లల కథలే రస్కిన్‌బాండ్ లోకం...26
చిత్రభారతి.. .30
మనసు పరవశింపచేసిన వేటూరి... 30
ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
సరదాగా కాసేపు నవ్వుకోండి..
వగైరా..వగైరా..



## తాజా వార్తలు

### ఆరు శతాబ్దాలుగా ఊరంతా ఖాళీ!


సుమారు అరవయ్యేళ్లుగా ఆ ఊరు ఖాళీగా ఉంది. చిట్టచివరి మనిషి ఆ ఊరిని ఖాళీ చేసి వెళ్లిపోయి నప్పటి నుండి ఆ గ్రామంలో పిట్టమనిషి కూడా ఉండటం లేదు. స్పెయిన్‌లోని స్వయంపాలన ప్రాంతమైన ఎక్స్ట్రెమాడురాలో ఉన్న ఈ ఊరి పేరు గ్రానడిల్లా. ప్రపంచం నలు మూలలా రకరకాల కారణాల వల్ల అక్కడక్కడా ఖాళీ ఊళ్లు కనిపి స్తుంటాయిగానీ గ్రానడిల్లా ఖాళీగా ఉండటానికి కారణం విషాదక రమైనది. ఈ చిన్న పట్టణాన్ని తొమ్మిదో శతాబ్దిలో అప్పటి ముస్లిం పాలకులు నిర్మించారు. ఈ ఊళ్లోని జనాలు ప్రధానంగా ఊరిబయ టి భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ బతికేవాళ్లు. స్పెయిన్ నియంత ఫ్రాన్సిస్కో ఫ్రాంకో 1950లో ఈ ఊరి దగ్గరలోని నది మీద రిజర్వాయర్ నిర్మించనున్నట్లు ప్రకటించాడు. రిజర్వాయర్ పనులు కొనసాగుతుండగా 1960 ప్రాంతంలో ఊరు మునిగిపో వచ్చని అప్పటి అధికారులు అంచనా వేశారు. దాంతో ఊళ్లోని జనాలు భయపడి ఊరిని ఖాళీ చేసేవారు. రిజర్వాయర్ నిర్మాణం పూర్తయినా ఊరు మునిగిపోలేదు. అయితే రిజర్వాయర్ కోసం ఊరికి దారి తీసే రోడ్లన్నీ కొట్టేశారు. దాంతో ఈ ఊరు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయి ఒక ద్వీపంలా మారింది.


### ప్రయాణానికి ముందే..

ఇది ప్రపంచంలోని అతిపెద్ద ప్రయాణికుల నౌక. ఇరవై అంతస్తుల తో, ఒకేసారి తొమ్మిది వేల మంది ప్రయాణించేందుకు వీలుగా ఆరుబయటి స్విమ్మింగ్ పూల్, విశాలమైన సినిమా థియేటర్ వంటి భారీ హంగులతో 'గ్లాబల్ డ్రీమ్-2' పేరిట దీని నిర్మాణం చేపట్టా రు. అయితే తొలి ప్రయాణానికి ముందే ఇది తునాతునకలుగా తుక్కు కానుంది. జర్మన్-హాంకాంగ్ నౌకా నిర్మాణ సంస్థ 'ఎంవీ వెర్ఫ్టెన్' ఈ భారీ నౌక నిర్మాణం చేపట్టింది. దీని నిర్మాణానికి 120 కోట్ల పౌండ్ల (రూ.11,090 కోట్లు) అంచనా వేయగా- నిర్మా ణ సంస్థ దీనికోసం ఇప్పటికే తొంభై కోట్ల పౌండ్లు (రూ.8,318 కోట్లు) ఖర్చు చేసింది. నిర్మాణం కూడా దాదాపుగా పూర్తయింది. సంస్థ వద్ద నిధులన్నీ పూర్తిగా ఖర్చయిపోయాయి. దీనిని యథాత థంగా అమ్మాలని నిర్ణయించుకున్నా కొనుగోలు చేయడానికి ఇప్పటి వరకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ నౌకను, దీనికి ముందు నిర్మించిన 'గ్లోబల్ డ్రీమ్' నౌకను కూడా తునాతునకలు చేసి, విడి భాగాలను విడగొట్టి తుక్కుగా అమ్ముకుని కొంతైనా నష్టాల నుండి బయట పడాలని ఎంవీ వెర్ఫ్టెన్ సంస్థ నిర్ణయించుకుంది.













# కార్డ్‌బోర్డ్ బాక్స్‌లతో అద్భుత బొమ్మలు





'కాదేదీ కవితకనర్హం' అన్నదానికి చక్కని తార్కాణం ఈ బొమ్మలు. కళాకారుల చేతిలో ఏ వస్తువయినా చక్కని ఆకృతిని సంతరించుకుంటుంది. చాలా మంది వృధాగా పడేసే అట్టపెట్టెలతో తయారు చేసిన కళాకృతులివి. నిజమే! ఈ బొమ్మలన్నీ కార్డ్‌బోర్డ్ బాక్స్‌లతో, జిగురు, కత్తెర ఉపయోగించి వాటితో వివిధ రకాలైన బొమ్మలు తయారు చేసారు. ఒకే రంగులో వున్న లాకరు, రిక్షా, కుట్టుమిషన్, గడియారం, కుర్చీ, గిటార్‌లు అట్టపెట్టెలతో తయారైనవంటే నమ్మశక్యం కావటం లేదు కదూ!





## 'సంఘీ' భావం



# ఆత్మహత్యలను నివారించలేమా!

గత కొంతకాలంగా వివిధ కారణాల వల్ల జరుగుతున్న ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకరంగా ఉంది. గత ఏడాదితో పోలిస్తే సుమారు 12 శాతం వరకు ఆత్మహత్యల సంఖ్య పెరిగినట్లు పోలీసు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే ఈసారి విచిత్రంగా కుటుంబకలహాలతో చిన్నపిల్లలను హత్యచేసి తాము ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు ఎక్కువగా ఉన్నాయి. పైగా చిన్నచిన్న కారణాలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తాము ఎదుర్కొంటున్న వేదనను ఎవరికి చెప్పుకోవాలో తెలియక మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు మానసిక నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కొన్ని దేశాల్లో కౌన్సెలింగ్ సెంటర్లు ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉంటాయి. ప్రజలకు కూడా తాము మానసిక వత్తిడిని తట్టుకోలేని సమయంలో ఈ కేంద్రాలకు వెళ్లి ప్రశాంతత పొందుతారు. అయితే మనదేశంలో అంతటి అవగాహన ఉండటం లేదు. క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇటీవల కొందరు పిల్లలు తమకు తల్లిదండ్రులు ఫోన్ కొని ఇవ్వలేదని, ఫోన్ చూడవద్దన్నారన్న అతిచిన్న కారణంతో కూడా బలవన్మరణానికి పాల్పడుతున్నారు. 2019లో 7,675 మంది తెలంగాణలో ఆత్మహత్య చేసుకోగా, 2020లో 8,058 మంది, 2021లో 9,800మంది ఆత్మహత్య చేసుకున్నారు. ఇక 2022లో ఇప్పటి వరకు సుమారు వెయ్యి మంది వరకు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో కుటుంబ తగాదాలతో ఒక వ్యక్తి తన ముగ్గురు పిల్లలను చెరువులో తోసి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పు గోదావరి జిల్లాలో తల్లి ముగ్గురు పిల్లలతో చెరువులో దూకగా ఒక పాప మాత్రం ప్రాణాలతో బయటపడింది. ఇలాంటి ఘటనలో రెండు తెలుగు రాష్ట్రాల్లో తరచుగా జరుగుతున్నాయి. ప్రధానంగా స్మార్ట్ ఫోన్లు వచ్చిన తరువాత ఈ ఆత్మహత్యల సంఖ్య పెరుగుతున్నట్లు మానసిక వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఫోన్లు రాకముందు పది మందితో మాట్లాడటం జరిగేది. బస్సు, రైలు ప్రయాణాల్లో తోటి ప్రయాణీకులతో పరిచయం చేసుకుని వారితో ముచ్చట్లు పెట్టేవారు. దీనివల్ల నిత్యం ఎదుర్కొనే సమస్యల నుంచి కొంత ఉపశమనం కలిగేది. ప్రస్తుతం సెల్‌ఫోన్‌లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ చాటింగ్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలతో బిజీగా ఉంటున్నారు. కొన్ని సందర్భాల్లో వారు దిగాల్సిన స్టేషన్ వచ్చినా పట్టించుకోనంతగా ఫోన్‌లో మునిగిపోతున్నారు. బాధ కలగకుండా ఎలా ఆత్మహత్య చేసుకోవాలి అన్న అంశం గురించి యూట్యూబ్‌లో సెర్చ్ చేసి మరీ ఆయా విధానాలకు పాల్పడుతున్నారు. పెరుగుతున్న ఆత్మహత్యలకు సెల్‌ఫోన్‌లు ఒక కారణం అయితే మరొకటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ లేకుండా పోవడం. గతంలో ఒక ఇంట్లో తాత, తాతమ్మ, తల్లిదండ్రులు, నలుగురైదుగురు తోబుట్టినవారు, వరుసకు అన్న, చెల్లెలు వరుస ఉన్న వారు ఉండేవారు. ఏదైనా సమస్య వస్తే తమకు చనువుగా ఉండే తాతమ్మతోనో, సోదరులతోనో పంచుకునే వారు. అయితే ప్రస్తుతం అంతా చిన్నచిన్న కుటుంబాలే ఉంటున్నాయి. భార్య, భర్త, ఒక బాబు గాని పాప కాని ఉంటున్నారు. ఇలాంటి కుటుంబాలే ప్రస్తుతం ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. ఒకవేళ వృద్ధులు ఉంటే వారితో ఉండటానికి యువత అంగీకరించడం లేదు. వారిని వృద్ధాశ్రమాలకో, లేక సమీప బంధువుల ఇంటికో పంపించివేస్తున్నారు. సాఫీగా సాగితే పర్వాలేదు. సమస్య వస్తే దానిని పరిష్కరించే వారు ఉండటం లేదు. ఇంట్లో ఎవ్వరైనా అన్యమస్తంగా, ఆందోళనగా కనిపిస్తే అప్పట్లో పెద్దవాళ్లు గుర్తించి వారిని పక్కకు తీసుకువెళ్లి విషయం తెలుసుకునే ప్రయత్నం చేసేవారు. సమస్యను అర్థం చేసుకున్న తరువాత దానికి పరిష్కార మార్గం చెప్పేవారు. దీనితో మనస్సు తేలికై మానసిక వత్తిడి నుంచి బయటపడటం జరిగేది. ప్రస్తుతం అటువంటి పరిస్థితులు ఉండటం లేదు. భార్యభర్తలు ఇద్దరూ ఉద్యోగులు కావడంతో వారిద్దరు కలిసి ఉండటమే అరుదుగా ఉంటోంది. ఇంట్లో పిల్లలు సమాజంలో ఏదైనా సమస్యను ఎదుర్కొంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. భార్యాభర్తల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇద్దరి మధ్య మనస్పర్థలు వస్తే వాటిని పరిష్కరించే వారు ఉండటం లేదు. ఇద్దరూ సంపాదనపరులు కావడంతో ఏఒక్కరూ తగ్గడానికి అంగీకరించరు. ఎంత డబ్బు ఉన్నా, ఎంత సంపాదిస్తున్నా మనసుకు శాంతి లేకుండా పోతోంది. ఇంట్లో పెద్దలు ఉంటే ఇలాంటి సమయంలో ఎవరి దగ్గర తప్పు ఉందో గుర్తించి వారిని సముదాయించి పరిస్థితి చక్కదిద్దే అవకాశం ఉంటుంది.

ఆత్మహత్యలు చేసుకున్న వారిలో చాలా మంది మానసిక నిపుణుల వద్దకు వెళ్లాలని అనుకుంటారు. కాని మరొకరి సహాయం తీసుకునే అవకాశం లేకపోవడంతో తీవ్రజాప్యం జరుగుతుంది. ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో 58 శాతం మంది కుటుంబ కలహాల వల్లనే అని పోలీసు రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కరోనా వచ్చిన తరువాత సామాన్యుల కష్టాలు మరింతగా పెరిగాయి. ఆర్థిక సమస్యలు ఎదురుకావడంతో కుటుంబంలో తగాదాలు పెరిగిపోతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య దూరం పెరిగిపోతోంది. తాము చనిపోతే ఎవరికీ పట్టదులే అన్న భావన కనిపిస్తోంది. ఇలాంటి విధానాలు ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ వైద్యశాలల్లో మానసిక వైద్య నిపుణుల సంఖ్య నామమాత్రంగా కూడా ఉండటం లేదు. మనస్సు ప్రశాంతంగా ఉంటే చాలారోగాలను తగ్గించుకోవచ్చు. మందులు వాడి మరిన్ని సమస్యలు తెచ్చుకోవడం కంటే మానసిక వైద్య నిపుణుల సలహాలను తీసుకోవడం ద్వారా అనేక సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంది. ప్రజలు, ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించి, ప్రణాళికలు చేయాల్సిన అవసరం ప్రస్తుతం ఎంతైనా ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# రెండు ఖండాల మధ్య నెలకొన్న దేశం తుర్కియె

షేక్ అబ్దుల్ హాకీం జాని

**ఆసియా, ఐరోపా** ఖండాల మధ్య నెలకొని వున్న దేశం తుర్కియె. ఆ కారణంగా ఈ దేశాల సఖ్యత తూర్పు, పడమరల కలయిక అయింది. దీని పూర్వ నామం టర్కీ. ముఖ్యంగా తుర్కియె ప్రధాన నగరం ఇస్తాంబుల్ ఇటు ఆసియా ఖండంలోనూ, అటు ఐరోపా ఖండంలోనూ వ్యాపించి ఉంది. తుర్కియెలో హెచ్చు శాతం మంది ముస్లింలు నివసిస్తున్నారు. టర్కిష్, కుర్దిష్, అరబిక్ భాషలతో పాటు ఈ దేశంలో దాదాపు 30 భాషలు ఉన్నప్పటికీ అధికారికంగా టర్కిష్ భాష మాట్లాడుతున్నారు. ఈ దేశం రాజధాని అంకారా. ఇస్లాం దేశం అయినప్పటికీ ప్రజాస్వామిక, సెక్యులర్, యూనిటరి, రాజ్యాంగ గణతంత్రంగా ప్రకటించుకోవడంతో పాటు అందరూ సెక్యులర్‌గా పరిగణించడం విశేషం. ఈ దేశాన్ని తుర్కియె జమ్ హూరియా, రిపబ్లిక్ ఆఫ్ తుర్కియె అని పిలుస్తారు. తుర్కియె దేశం యుర్తా సుల్హ్ సిహాందాసుల్హ్(ఇంట్లో శాంతి, ప్రపంచంలో శాంతి) అని నినాదంతో ముందుకు సాగుతోంది. 'ఇస్తిక్‌లాల్ మార్సి' అనేది ఈ దేశం జాతీయ గీతం. తుర్కియె చాలా వైవిధ్యమైన సంస్కృతిని కలిగిన దేశం.

తుర్కియెలో ఒగుజ్ టర్కిక్ సంస్కృతి, అనటోలియా, ఒట్టమన్ (గ్రీకు-రోమన్, ఇస్లామిక్ సంస్కృతి), పశ్చిమ సంస్కృతి సంప్రదాయాలు (ఒట్టమన్ సామ్రాజ్యం వెస్ట్రనైజేషన్ ప్రక్రియ) ఇత్యాది వైవిధ్యమైన మిశ్రిత సంస్కృతులు ఇక్కడ నేటికీ కొనసాగటం విశేషం. తుర్కియె ఒకవైపు సంప్రదాయం, మతం, చారిత్రక విలువలను కాపాడుకుంటూ ఆధునిక పశ్చిమ దేశాల సంస్కృతిని అలవరచుకుంటున్న దేశాలలో ఒకటిగా భాసిల్లుతోంది.

## తుర్కియె అని పేరు మార్చుకున్న టర్కీ

టర్కీ అనే పేరు ఇక్కడ టర్కిష్ ప్రజలు నివసించిన కారణంగా వచ్చింది. 8వ శతాబ్దంలో మొదటిసారిగా మధ్య ఆసియాలో కనిపించిన శిలాశాసనాలలో 'గోక్టర్క్స్' అనే పేరు ఆధారంగా (పురాతన టర్కిక్ అక్షరాల) టర్కీ అనే పేరు మొదటిసారిగా నమోదు అయిందని భావిస్తున్నారు. ఆంగ్ల నామం 'టర్కీ' మొదటిసారిగా 14వ శతాబ్దంలో మెడీవల్ లాటిన్ 'టర్చియా' ఆధారంగా ఏర్పడింది. గ్రీకులు ఈ ప్రాంతాన్ని టర్కియా అని పేర్కొన్నారు. బైజాంటైన్ చక్రవర్తి, కవిపండితుడైన ఏడవ కాన్‌స్టాంటైన్ రాసిన 'డీ ఆడ్మినిస్ట్రాండో ఇంపీరియో' పుస్తకంలో ఈ ప్రాంతాన్ని టౌర్కియాగా పేర్కొన్నారు. టర్కీ అంటే ఆంగ్లంలో ఫెయిల్యూర్, మూర్ఖుడు, సిల్లీఫెలో మొదలైన అనేక అర్థాలు ఉన్నాయి. ఈ కారణంగా ఆ దేశం తన పేరును జూన్ 2022 నుండి 'తుర్కియె'గా మార్చుకుంది. తుర్కుల సంస్కృతి, సంప్రదాయాలు, నాగరికత, విలువలకు తుర్కియె అనే పదం చక్కగా నప్పుతుందని అక్కడి ప్రభుత్వం భావించింది. ఈ విషయాన్ని ఐక్యరాజ్యసమితికి పంపిన లేఖలో కొత్త పేరును అధికారికంగా

గుర్తించాలని ప్రపంచ దేశాలు సైతం 'తుర్కియె' అని పిలవాలని కోరారు. టర్కీ అభ్యర్థనను ఐక్యరాజ్యసమితి అంగీకరించింది. కొన్ని దేశాల మాండలికాలను అనుసరించి టుర్కియా, తుర్కియే, తుర్కియా అని కూడా పిలుస్తున్నారు. గతంలో అనేక దేశాలు పేర్లు మార్చుకున్న సంఘటనలు ఉన్నాయి. హాలెండ్ నెదర్లాండ్స్ అని, పర్షియా ఇరాన్‌గా, సియామ్ దేశం థాయిలాండ్‌గా, జాంబియా రొడిషియాగా తమ దేశాల పేర్లు మార్చుకున్నాయి.

**ఇస్తాంబుల్**

తుర్కియె దేశంలోనే అతిపెద్ద ప్రధాన నగరాలలో ఇస్తాంబుల్ ఒకటి. దీన్ని ఒకప్పుడు 'కాన్‌స్టాంటినోపిలస్' అని పిలిచేవారు. ఇస్తాంబుల్‌ను ఏడు కొండల నగరమని కూడా పిలుస్తారు. టర్కీలోని మహాద్భుత కట్టడాలకు నిలయం ఇస్తాంబుల్. ఈ నగరం ఆసియా, యూరప్ ఖండాలలో విస్తరించి ఉంది. ఇస్తాంబుల్ నగరం రోమన్ సామ్రాజ్యం ద్వారా నిర్మితమైంది. తుర్కియె దేశం సగ భాగం ఆసియాలోనూ, మిగిలిన సగ భాగం యూరప్‌లో ఉంటే రెండు ఖండాల మధ్య నెలకొని ఉన్న తుర్కియె ప్రధాన నగరమే ఇస్తాంబుల్. యూరప్‌లోనే అధిక జనసాంద్రత గల నగరం. ప్రపంచంలో నాలుగవ అత్యధిక జనాభా గల నగరం. తుర్కియె అతి పెద్ద నగరం. సాంస్కృతిక, వాణిజ్య కేంద్రం. ఇస్తాంబుల్ రాష్ట్రంలో 27 జిల్లాలు ఉన్నాయి. బోస్ఫొరస్ జలసంధిలో ప్రకృతిసిద్ధమైన ఓడరేవు ఉంది. దీనిని 'గోల్డెన్ హార్న్' అని కూడా అంటారు. గోల్డెన్ హార్న్‌పై విస్తరించి ఉన్న వంతెన పేరు గలాటా వంతెన. తుర్కియె సుదీర్ఘ చరిత్రను పరిశీలిస్తే 330-395 వరకు రోమన్ సామ్రాజ్యపు రాజధానిగా, 395-1204 వరకు బైజాంటియన్ సామ్రాజ్యపు రాజధానిగా, 1204-1261 వరకు లాటిన్ సామ్రాజ్యపు రాజధానిగా, 1453-1922 వరకు ఉస్మానియా సామ్రాజ్యపు రాజధానిగా భాసిల్లింది. ఇస్తాంబుల్‌లోని పలు చారిత్రక ప్రాంతాలు యునెస్కోవారిచే ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా ప్రకటించబడ్డాయి. ఇస్తాంబుల్ నగరంలో హాగియా సూఫియా, నీలి మస్జిద్‌లు చాలా ప్రసిద్ధి చెందాయి. ప్రాచీన చరిత్రకు నిలువెత్తు నిదర్శనం హాగియా సోఫియా మస్జిద్. ఇది ఇస్తాంబుల్ వుంది. హాగియా సోఫియా మస్జిద్‌ను ఒకప్పుడు శాంక్తాసోఫియా అని పిలిచేవారు. తరువాత పేరు మార్చారు. దీని నాలుగు మినార్లు ఆకాశాన్ని తాకినట్లుంటాయి. దాదాపు 101 అడుగుల వ్యాసార్థంతో దీని గుమ్మటాన్ని అద్భుతంగా 108 అడుగుల ఎత్తులో నిర్మించారు. ఇస్తాంబుల్ అంటేనే ఒక వింత నగరమని చెప్పవచ్చు. అతి పురాతన నగరాలలో ఇస్తాంబుల్ ఒకటి. రోమ్ చక్రవర్తి కాన్‌స్టాన్‌టినోపిల్ పేరుతో ఒకప్పుడు బైజాన్‌టైన్ సామ్రాజ్యపు ప్రధాన నగరంగా ఇది భాసిల్లింది. గ్రీకు, రోమను నాగరికత,





సంస్కృతుల సమ్మేళనం కాన్‌స్టాన్‌టినోపిల్ పట్టణం. ఈ పట్టణాన్ని నేడు ఇస్తాంబుల్‌గా పిలుస్తున్నారు. 1453 మే 29 నుండి ఈ పట్టణం ఒటోమాన్స్ అధీనంలోకి వెళ్లింది. భౌగోళికంగా పలుమార్లు భూకంపాలకు గురైనప్పటికీ హెచ్చుగా నష్టపోకుండా చెక్కుచెదరక నిలిచివున్న ప్రాచీన నగరం ఇస్తాంబుల్. ఇలా ఎన్నో పరిణామాలు జరిగిన ఇస్తాంబుల్ నగరంలో హాగియా సోఫియా మస్జిద్ ఒక ప్రధానమైన ప్రాచీన నిర్మాణం. తొలుత ఇది చర్చిగా ఏర్పడినా ఈ నిర్మాణాన్ని, తరువాత మస్జిద్‌గా, ఇప్పుడు పురావస్తు ప్రదర్శనశాలగా మార్చారు.

హాగియా సోఫియా అనేది గ్రీకు పదం. గ్రీకు భాషలో దీని అర్థం 'పవిత్ర జ్ఞానం'. టర్కీ భాషలో ఆయా సోఫియా అంటారు. గ్రీకులు దీన్ని సాంప్రదాయబద్ధమైన చర్చిగా భావించేవారు. క్రీ.శ.1204 నుండి 1261 మధ్య కాలంలో దీనిని రోమన్ క్యాథలిక్ చర్చిగా మార్చారు. ఈ కాలం తప్పితే క్రీ.శ.537 నుండి 1453 వరకు ఇది ఒక సాంప్రదాయ చర్చిగా 'ఈస్ట్రన్ ఆర్థడాక్స్ కెదడ్రల్‌గా కాన్‌స్టాంట్‌నోపిల్‌లో ఉండేది. ఆ తరువాత 29 మే 1453 నుండి 1931 వరకు దీన్ని మస్జిద్‌గా మార్చారు. నాటినుండి హాగియా సోఫియా మస్జిద్ ఒక లౌకిక ప్రదేశంగా మారి ప్రపంచంలో దీనిని ఎవరైనా సందర్శించేలా రూపొందించారు. ఈ మస్జిద్‌లో అందమైన పెయింటింగ్స్ ఉన్నాయి, శిల్పకళ పరమాద్భుతంగా ఉంటుంది. హాగియా సోఫియా బైజంటైన్ శిల్పశైలికి ఇది అద్దం పడుతుంది. శిల్పకళా చరిత్రలో ఈ డోమ్ ఒక నూతనాధ్యాయానికి శ్రీకారం చుట్టిందని చెప్పవచ్చు. 532-537 మధ్య కాలంలో బైజంటైన్ చక్రవర్తి మొదటి జస్టినియన్ ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్మాణాన్ని ప్రారంభించారు. ప్రపంచంలోని మూడవ అతి పెద్ద చర్చిగా ఆ కాలంలో ప్రఖ్యాతి గాంచింది. గ్రీకు దేశానికి చెందిన ఇసిడోర్ మిలిటస్, యాందెనియస్ ట్రాల్స్ అనేవారు దీని డిజైన్‌కు రూపకల్పన చేశారు. కాన్‌స్టాంట్‌నోపిల్ పట్టణం 29 మే 1453లో ఒటోమాన్స్ అధీనంలోకి వచ్చింది.

రెండవ సుల్తాన్ మొహమ్మద్ సంప్రదాయాలు, ఆచారాలు పాటించేవారు. ఆయన తన సేనలను కాన్‌స్టాంట్‌నోపిల్‌కు పంపి ఈ నిర్మాణంలోని విలువైన సంపదను తీసుకురమ్మని ఆజ్ఞను జారీ చేశారు. సైనికులు ఈ నిర్మాణానికున్న బలిష్టమైన తలుపులను బద్దలుకొట్టి సంపదను తరలించారు. అప్పటివరకు ఇందులో ఉన్న పీఠాన్ని సౌదీ అరేబియా లోని పవిత్ర గృహం కాబాకు అభిముఖంగా దిశను మార్చిన ఉలేమాలు దానిపై నిలబడి నేటి నుండి దీన్ని మస్జిద్‌గా మారుస్తున్నట్లు ప్రకటించి దీనికి హాగియా సోఫియా మస్జిద్‌గా నామకరణం చేశారు.

**(14వ పేజీ తరువాయి)**



# ఇల్లే కోవెల

**కవర్ స్టోరీ**

**కాళంరాజు వేణుగోపాల్**

## 'సెల్‌ఫోన్‌లో

ఆటలు ఆడనివ్వడం లేదని' ఏడవ తరగతి చదివే లోకేష్ మేడ మీద నుంచి దూకి ఆత్మహత్య, ఎనిమిదవ తరగతి చదివే అనుపమ తల్లి అరిచిందని ఇంట్లోంచి పారిపోయి తల్లిదండ్రుల్ని బ్లాక్ మెయిల్ చేయడం, తొమ్మిదవ తరగతి చదివే అంబరీష్ తను ప్రేమిస్తున్న అమ్మాయి మాట్లాడడం లేదని ఆ అమ్మాయిపై హత్యాయత్నం, పదవ తరగతి చదివే కిరణ్ పదో తరగతి పరీక్షల్లో టాప్ మార్కులకు రెండు మార్కులు తక్కువ వచ్చాయని డిప్రెషన్‌కు గురై రైలు కింద పడి దుర్మరణం, ఇంటర్‌లో నచ్చిన గ్రూపులో చేరనివ్వలేదని రాజేష్ ఉరి వేసుకుని ఆత్మహత్య, బీటెక్ కాలేజీలో కోరుకున్న విభాగంలో సీటు రాలేదని పురుగుల మందు తాగిన సుధాకర్, పెళ్లయిన మూడు నెలలకే మొగుడిని వదిలేసి పుట్టింటికి వచ్చిన సుజాత, పెళ్లయి ఇద్దరు పిల్లలున్న మనోహర్ ఇంకో అమ్మాయితో రాసలీలలు జరుపుతూ కట్టుకున్న పెళ్లాన్ని కడతేర్చిన వైనం, మాదక ద్రవ్యాలకు అలవాటు పడి కన్న తల్లిదండ్రులను ఘోరంగా నరికి చంపిన విజయ్, టీచర్ మందలించాడని తుపాకీతో కాల్చబోయిన విద్యార్థి, పరీక్షల్లో మార్కులు తక్కువ వేశాడని ఉపాధ్యాయురాలిని కత్తితో పొడిచి చంపిన విద్యార్థి బృందం, తన కుమారుడి కంటే ఎక్కువ మార్కులు వస్తున్నాయని అతడి స్నేహితుడికి విషం ఇచ్చి చంపేసిన ఒక కన్నతల్లి ఘాతుకం... ఇలా ఎన్నో! ఎన్నెన్నో!

ఇవే కదా ఈ మధ్య కాలంలో ఏ పేపర్ తిరగేసినా కనబడే వార్తలు. ప్రతీరోజు ఎక్కడో అక్కడ మనలను ఇబ్బందికి గురి చేసేవి. ఎంతో మంది గుండెకోతకు కారణమయ్యేవి. ఈ మధ్య కాలంలో మాదక ద్రవ్యాల వినియోగం ఎక్కువై, చిన్న పిల్లల కేసులు బాగా పెరుగుతున్న నేపథ్యంలో పిల్లల పేరు మీద ఇంటికి వచ్చిన పార్శిళ్లను తల్లిదండ్రులు గమనించాలి. తమ పిల్లలకు ఇచ్చే డబ్బులను వారు ఎలా ఖర్చు చేస్తున్నారో కనుక్కోవాలి. వారు బయట ఎటువంటి వారితో స్నేహం చేస్తున్నారో, ఎటువంటి స్నేహితులతో కాలం గడుపుతున్నారో తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి అని డీజీపీ స్థాయి వ్యక్తి హెచ్చరిస్తున్నాడంటే పరిస్థితి ఎక్కడిదాకా పోయిందో అర్థం చేసుకోవాలి. అసలు ఏమి జరుగుతోంది? కారణం ఏమిటి? ఎందుకీ అభిజాడ్యం? ఇదే ఈ వారం కవర్ స్టోరీ..

## బంధాల్లో బలమెంత?

భారతదేశం సకల సంపదలకు పుట్టినిల్లు. సంస్కృతీ సంప్రదాయాలకు, మానవత విలువలకు, నైతిక ప్రవర్తనకు మారు పేరు. బంధాలకు విలువిస్తూ, అనుబంధాలను పెంచి పోషిస్తూ కుటుంబ విలువలకు ప్రాధాన్యమిస్తూ, సమాజాన్ని పటిష్టపరుచుకుంటూ వ్యక్తికి సమాజం అండగా, సమాజానికి దేశం తోడుగా ఒకరికి ఒకరై వసుధైక కుటుంబంగా విలసిల్లిన దేశం. మన దేశ కుటుంబ వ్యవస్థని, వివాహ వ్యవస్థని ఎన్నో దేశాలు మెచ్చుకుంటాయి. ఆదర్శంగా తీసుకుంటాయి. మన పురాణాలు, ఇతిహాసాలు మనం ఎలా ఉండాలో, ఉండకూడదో చక్కగా వివరిస్తూ మనల్ని మార్గనిర్దేశం చేస్తున్నాయి. చక్కటి కథలతో, పాత్రలతో మానవ జీవితం చక్కగా సాగేటట్లు మనల్ని నడిపిస్తున్నాయి.మంచేదో, చెడేదో వివరిస్తూ మన బతుకుకి ఒక నిర్వచనం ఇస్తూ మనల్నిగమ్యం వైపు దూసుకుపోయేటట్లు ప్రోత్సహిస్తున్నాయి.

## మన సంస్కృతి సంప్రదాయం

మన భారతీయ సంస్కృతి సంప్రదాయం భవ్యమైనది, దివ్యమైనది. ఆ మాటకొస్తే అభేద్యమైనది. అది మన నైతిక విలువలు, మానవత్వ విలువలు, మన నాగరికత విశిష్టతని విపులంగా వివరిస్తాయి. మన సంస్కృతీ సాహిత్య సంప్రదాయాలు మనలో నిబిడీకృతమైన మానవతావిలువల్ని ఎల్లవేళలా జాగృతపరుస్తుంటాయి. అవి జాతి ఔన్నత్యానికి ఆసరాగా నిలబడతాయి. మన సంస్కృతి ఆదినుండి మానవతా పరిమళాలను వెదజల్లుతూ మానవునిలో మార్పును తీసుకొచ్చే మంచిని పెంచుతూ, పంచుతూ అవనితో అందరికీ ఆదర్శంగా ఆవిష్కృతమై అగ్రపూజనందుకుంటుంది. కనుకనే ప్రపంచంలో అసలైన మానవత్వం ఎక్కడుందని ఎవరైనా ప్రశ్నిస్తే అది ఒక్క భారతదేశంలోనే మిగిలి వుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. గీతలో కృష్ణుడు చెప్పినట్లు 'ఆత్మవత్ సర్వ భూతాని' నాతో ఆత్మ జ్యోతి అన్ని జీవులలో చరాచర జగత్తులో కూడా వున్నది.. అదే పరమాత్మ. అదే పరంజ్యోతి, పరబ్రహ్మ స్వరూపం.

ఆత్మ చైతన్యం. అందుకే మనం చెట్టు, పుట్ట, రాయి, రప్పలో కూడా ఆ భగవం తుణ్ణి దర్శిస్తాం. ఇది తెలియక చేసే మూఢ త్వం కాదు తెలిసి చేసే దివ్యత్వం. అహిం సా పరమో ధర్మః అన్నది మన వేదం. అదే మన వాదం, జీవన నాదంగా నిల్చింది. పరోపకారమే పుణ్యమని, పరులను పీడించ డమే పాపమని అష్టాదశ పురాణాల సారాం శమిదేనని వ్యాస మహర్షి ఎప్పుడో చెప్పేశా రు. నిరుపేదలకు, నిర్భలులకు, రోగులకు, అనాథలకు ఊతనాశించే వారికి, ధైర్యం కోల్పోయిన ఆపన్నులకు, ఆపదల్లో కొట్టు మిట్టాడేవారికి కాస్తంత ఊతను, ధైర్యాన్ని ఆశను,ఆత్మవిశ్వాసాన్ని, వ్యక్తిత్వ పరిమళాల నందించేదే మానవత్వం అంటారు పెద్దలు.

**ఆ రోజులే వేరు..**

గతంలో ఉమ్మడి కుటుంబాలు బలంగా ఉన్న రోజుల్లో ఇంట్లో పెద్దలు, పిన్నలు అందరూ కలిసి మెలసి జీవించేవారు. పిన్నమ్మలు, బాబాయిలు, మామయ్యలు, అత్తయ్యలు, నాయనమ్మలు, తాతయ్యలు, పిల్లలు ఉండేవారు. సంస్కృతీ సాంప్రదా యాలు పెద్దల నుండి పిల్లలకు వారసత్వం గా వచ్చేవి. మంచి, చెడు విడమర్చి చెప్పే వారు. అందరి మధ్య బంధాలు బలంగా ఉండేవి. పండుగలు, పబ్బాలు, ఇంట్లో కార్యక్రమాలు చక్కగా జరుగుతూ వాటిని తర్వాతి తరాలకు అందించేవారు. ఇదే కదా సాంస్కృతిక వారసత్వం. ఏదైనా ఇబ్బంది వచ్చినా, అవసరం వచ్చినా ఒకరికి ఒకరు తోడుండేవారు. సుఖాలు, సంతోషాలను ఇచ్చి పుచ్చుకునేవారు. కష్టాలు, కన్నీళ్ల పంచుకునే అవకాశం ఉండేది. అమ్మమ్మలు, తాతయ్యలు సాయంత్రం అయితే చక్కటి నీతికథలు, కుటుంబ విలువలు తెలియ జేస్తూ మంచి మంచి విషయాలు చెబుతూ పిల్లల్లో మానవత్వ విలువలు, నైతిక నిలువ లువ ఆరు పాటిస్తూ చక్కగా చెప్పేవారు. దానితో వారికి జీవితం విలువ, అవసరం గొప్పగా అర్థమయ్యేది. ఏదైనా అనుకోని సమస్య ఏర్పడినా ఎవరికో ఒకరికి మనసు విప్పి చెప్పుకునే అవకాశం లభించేది. పెద్దలు కూడా వారి అనుభవం, ఆలోచనల తో వారిని ఓదార్చేవారు. ముందుండి నడిపించేవారు. సమస్యల నుండి గట్టెక్కించే వారు. మిగతా వారికి కూడా 'మాకు అండ' అని భరోసా లభించేది. దాంతో ఏదైనా చేయగల సత్తా ఉందని నమ్మకం ఉండేది. పెద్దల ఆలోచనలతో వారికి సంబంధించిన సరైన నిర్ణయం తీసుకునేవారు. పిల్లలు కూడా పెద్దల ఆలోచనలతో పనిచేస్తూ ధైర్యంగా ముందడుగు వేసేవారు. అటువంటి సమయంలోనే కదా కుటుంబ విలువలు, బంధాలు, బాధ్యతలు తెలిసి వచ్చేవి. అదేదో సినిమాలో చెప్పినట్టు మనం గెలిచినప్పుడు చప్పట్లు కొట్టేవారు, ఓడినప్పుడు భుజం తట్టి ఓదార్చేవారు నలుగురు లేనప్పుడు గెలిచినా ఓడినా పెద్ద తేడా ఏమీ లేదని అన్నట్లు మనం మంచి పని చేసినప్పుడు సంతోషపడేవారు. చెడ్డ పని చేసినప్పుడు కాదని చెప్పగలిగేవారు ఉన్నప్పుడే కదా మనిషికి, బంధానికి విలువ.

**పెరుగుతున్న ఆకాంక్షలు**

రాను రాను పరిస్థితులలో స్పష్టమైన మార్పులు రావడం ఆరంభించాయి. మనది, మనం అనే స్థానంలో నాది, నేను అనే పదాలకు విస్తృతంగా చోటు లభించడం, డబ్బు, హోదా, గౌరవం, ప్రతిష్ఠ లాంటివి వ్యక్తిగతంగా తీసుకోవడం ఉమ్మడి కుటుంబాలు చీలికలు పేలికలై చిన్న కుటుంబాలు ఏర్పడడం, మంచి జీవితం కోసం భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగమో, వ్యాపారమో చేయడం, డబ్బు సంపాదనలో పడి హడావిడి జీవితాలకు అలవాటు పడడం, గతంలో ఒక్కో ఇంట్లో హీనపక్షం నలుగురు పిల్లలు ఉండే కుటుంబాలలో ఒకరు లేదా ఇద్దరికే కుదించడం తోటి పిల్లల మీద ఆపేక్షలు, ఆకాంక్షలు పెరగడం, అదే సమయంలో ఇబ్బడి ముబ్బడిగా వచ్చి పడుతున్న డబ్బుతో 'కేవలం డబ్బుంటే చాలు.. ఎటువంటి కష్టాలు ఉండవనే' అపోహాలతో పిల్లలు ఏది అడిగినా కాదనకుండా ఇవ్వడమే తల్లిదండ్రుల పని అన్నట్లు ప్రవర్తించడం కొందరి విషయంలో జరుగుతుంది. ఇది ఎంతవరకు దారి తీసిందంటే తమ పిల్లల పట్ల ప్రేమను కేవలం డబ్బుతో కొలవవచ్చు, కొనుక్కోవచ్చు అనే స్థాయికి ఆ కొందరు తల్లిదండ్రులు దిగజారారు. డబ్బు కంటే ఉత్తమోత్తమైనవి ఇంకా చాలా ఉన్నాయనే సంగతిని వారు ఎప్పుడో మర్చిపోయారు. దానితో ఎక్కడ పిల్లలు తిప్పలు పడతారోనని అప్పు చేసైనా సరే, తప్పు చేసైనా సరే వారి మెప్పు పొందాలి అన్నట్లు విపరీత మనస్తత్వం ఏర్పరచుకోవడం, కోరింది ఏదైనా సరే కళ్లముందు వాలడం అలవాటు పడ్డ కొంతమంది పిల్లలు ఎప్పుడైనా వారికి ఇష్టం లేని పని జరిగినా, చేయాల్సి వచ్చినా తీవ్ర మానసిక దౌర్భల్యానికి గురికావడం, దానితో విపరీత చేష్టలు, గందరగోళ పనులు చేయడం చూస్తున్నాం. వారు ఏం



చేస్తున్నారో ఎలా చేస్తున్నారో కూడా తెలియకుండా మూర్ఖంగా ప్రవర్తించడం, కాదంటే బెదిరింపులకు, దాడులకు దిగడం అలవాటు చేసుకున్నారు. పైపెచ్చు పిల్లల్లో చెలరేగే మానసిక అసమతుల్యాలను గుర్తించి సరైన సహాయం అందించే తీరిక, ఓపిక లేని పెద్దలు ఎక్కువయ్యారు. అలాంటి వారికి సరైన సమయంలో చికిత్స అందకపోతే తీవ్రమైన మానసిక డిప్రెషన్‌కి గురయ్యే ప్రమాదం ఉంది. సంఘ విద్రోహ శక్తులు అటువంటి అవకాశాన్ని ఉపయోగించుకొని మత్తుమందు లు, మాదక ద్రవ్యాలకు పిల్లల్ని బానిసలు చేసే ప్రమాదం ఉంది. ఇవేవి లేకపోయినా ఇంట్లో ఉండే టీవీ, అరచేతిలో ఇమిడిపోయే సోషల్ మీడియా వారు ఏం చేయాలో తరచుగా బోధిస్తూనే ఉన్నాయి కదా. అసభ్య సినిమాలు, జుగుప్సాకరమైన కామెడీ షోలు, మన సంస్కృతిని భ్రష్టు పట్టించే రకరకాల లైవ్ షోలతో పిల్లల మెదడులో విషపు రాతలు రాస్తూనే ఉన్నాయి.

అవన్నీ వారిని నియంత్రిస్తూ తమ చెప్పుచేతల్లోకి తీసుకుంటున్నాయి. కొందరు పెద్దలు చూపే నిర్లక్ష్యం పిల్లల పాలిట శాపంలా మారుతుంది. పెద్దలు ఉదయమంతా ఆఫీసులో, పిల్లలు బడిలో గడిపిన తర్వాత మిగిలిన ఆ కొద్ది సమయంలో తరచూ తమలో తామే గొడవపడే తల్లిదండ్రులు గల ఇంట్లో పిల్లలు, పెద్దల నిర్లక్ష్యం చవిచూసిన పిల్లలు తీవ్ర మానసిక వేదనకు గురి అవుతున్న దాఖలాలు అనేకం ఉన్నాయి. ప్రేమ కరువై, చెప్పుకునేవారు లేక, తమ ఎమోషన్స్ ఎవరికి చెప్పుకోవాలో తెలియక,

తట్టుకోలేక అటువంటివారు కొన్ని రోజులకు తీవ్ర దుశ్చర్యలకు పాలుకావడమో, సంఘ విద్రోహ శక్తులుగా మారడమో చూస్తున్నాం.


కుటుంబ వ్యవస్థకు బీటలు

ఎంత గొప్ప విలువలున్నా, ఇంకెంత మానవత్వ సూత్రాలున్నా అవి ముందు తరాలకు అందిస్తేనే వాటి విలువ, గౌరవం కాపాడబడతాయి. సమాజానికి రక్షణ కవచంలా నిలబడతాయి. అయితే ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం, నేటి తరం డబ్బు వెంట పరుగులు తీయడం, క్షణం తీరిక లేకుండా గడపడం, మంచి-చెడు విచక్షణ కోల్పోవడం వల్ల నవతరం ఒకానొక స్టేజీలోకి బలవంతంగా నెట్టివేయబడుతున్నాయి. ఆ క్రమంలో విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థ, పతనమవుతున్న మానవీయ విలువలు సమాజాన్ని ఎంత గందరగోళంలో పడవేస్తున్నాయో అర్థం చేసుకునే ఓపిక తీరిక కూడా లేనట్లే ప్రవర్తిస్తున్నాం. కుటుంబ విలువలు, సమిష్టి ఆలోచనల నేపథ్యం గురించి మనం గర్వంగా చెప్పుకుంటాం. వ్యక్తిగత ధోరణుల కంటే సమిష్టి ఆలోచనల ధోరణులకి ప్రాధాన్యమిచ్చే సంస్కృతిగా మనల్ని ప్రపంచమంతా అభివర్ణించడం కొత్త కాదు. ఈ సమిష్టి ఆలోచనా ధోరణే మన దేశంలో కుటుంబ వ్యవస్థలోని పటిష్టతకి పునాదిగా వర్ణించడం జరుగుతుంది. మారుతున్న ప్రపంచ పరిస్థితుల్లో అతి వేగంగా సంస్కృతిపరమైన దిగుమతులు, మార్పులు జరుగుతున్నాయని అనేకమంది అనేక సందర్భాలలో ప్రస్తావించడం మనందరికీ తెలిసిందే. ప్రపంచంలో సంస్కృపరమైన సరిహద్దులు పలుచనైపోయి, పరస్పర సంస్కృతుల ప్రభావాలు స్పష్టమవుతున్నాయి. ఈ ప్రభావాలకీ, మార్పులకీ, కుటుంబ వ్యవస్థ, అనుబంధాలు అతీతం కాదు. కానీ మన సంస్కృతి సంప్రదాయాలను జాగ్రత్తగా పట్టుకొస్తూ, అదే సమయంలో మానవీయ విలువలను పిల్లల్లో హృద్యంగా నెలకొల్పుతూ ముందుకు సాగకుంటే రాబోయే రోజుల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుందేమో!

**బాధ్యులు ఎవరు?**

పతనమవుతున్న విలువలు విశృంఖలమైన అనైతిక ఆనందాలతో గత కొన్నేళ్లుగా మానవ సంబంధాలు ముఖ్యంగా యువతలో నైతిక విలువలు క్షీణించడం చూస్తున్నాం.

అదేమంటే న్యూ జనరేషన్ అని దీర్ఘాలు. దీని ఫలితంగా పెరుగుతున్న ఆత్మహత్యలు,



మానభంగాలు, దోపిడీలు, విడాకులు, సహజీవనాలు, దిగజారుడు సంబంధాలు పేట్రేగిపోతున్నాయి. మన సమాజంలో ఎప్పటినుంచో వేళ్లూనుకున్న సాంప్రదాయిక విలువలకు తిలోదకాలిచ్చి నూతన ధోరణులను, విలువలను ప్రజలు పాటిస్తున్నారు. పేట్రేగిపోతున్న అసాంఘిక కార్యక్రమాలను నిరోధించలేని, నిస్సహాయ స్థితిలోకి ప్రజలు నెట్టబడుతున్నారు. అయితే ఈ నూతన ధోరణులను మనం విస్మరించలేం. వాటిని అలాగే వదిలేస్తే జరగబోయే పరిణామాలకు ఎవరు బాధ్యులు? మాదక ద్రవ్యాలకు అలవాటుపడ్డ యువత గురించి ప్రస్తావించినప్పుడల్లా యువత అలా మారడానికి కారణం తల్లిదండ్రులని, సమాజమని లేక ఇంకొకటని ఎత్తిచూపడంతో సరిపెట్టుకుంటున్నాం. ఇలాంటి సంఘటనలు వెలుగులోకి వచ్చినప్పుడు ప్రతిఒక్కరూ ఇంకొకరిని నిందించడం చేస్తుంటారు. అంతేగానీ ఇలాంటి సంస్కృతి నుంచి బయటపడి నివారణ, పరిష్కరణ మార్గాలు గురించి చర్చించాలన్న వివేకం మాత్రం చూపం. ఎందుకంటే ఈ రుగ్మతను అశ్రద్ధ చేయడం సమాజానికి పెద్ద ముప్పును తెచ్చిపెట్టడమే కాదు భవిష్యత్తులో సమాజ వినాశకారి అయినా ఆశ్చర్యం లేదు. మారుతున్న ఆధునిక జీవన శైలి టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో తరిగిపోతున్న మానవ విలువలను నేటి యువత కాపాడాల్సిన అవసరం ఉంది. సెల్‌ఫోన్ టెక్నాలజీని ఉపయోగించుకుని నేటి యువత పెడతోవ పడుతున్నారు. అలాగే పోర్న్ వీడియోలు, మద్యం, డ్రగ్స్, చెడు స్నేహాల వల్ల అమ్మాయిలు, బాలికల పైన దాడులు పెరుగుతున్నాయి. మారుతున్న జీవన అలవాట్లు యువతీ యువకుల మీద చాలా ఎక్కువగా ఉంటోంది. సెల్ ఫోన్ ద్వారా ప్రపంచాన్ని చదివే అవకాశం ఉంది. జీవన గతిని మార్చుకునే సౌలభ్యం ఉంది. అభివృద్ధి చెందే ఆస్కారం ఉంది. అది సరిగ్గా ఉపయోగించుకుంటే వాటిని సరిగ్గా ఉపయోగించుకుని మేధస్సు పెంచుకోవడం, అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా కృషి చేయడం చేయాలి. కానీ ఎక్కువగా యువత అనవసర విషయాలకు పెద్ద పీట వేస్తూ తన బతుకులను నిర్వీర్యం చేసుకుంటున్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు అందరికంటే ముందు ఉండాలని తాపత్రయపడుతూ హోదా అని స్టేటస్ అని లేని తాహతు తెచ్చివ్వడానికి, వారు కష్టం అంటే ఏమిటో తెలియకుండా ఉండాలనే అపోహతో అప్పులు చేసి మరీ వారి గొంతెమ్మ కోర్కెలు తీర్చడానికి ప్రయత్నిస్తూ వారిని వారు మోసం చేసుకుంటున్నారు. అంతేకానీ వారికి కష్టం విలువ, కన్నీటి విలువ తెలియజెప్పాలని ప్రయత్నం చేయడం లేదు. తీరా చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా లబోదిబోమంటున్నారు.

### మారిన విద్యా వ్యవస్థ

మారుతున్న జీవన శైలిలో విద్యా వ్యవస్థలో కూడా అనేక మార్పులు సంభవించాయి. ప్రభుత్వాల మితిమీరిన జోక్యం వలన విద్యా వ్యవస్థ గాడి తప్పుతుంది. ఎక్కడో ఏదో సంఘటన జరిగిందని వ్యవస్థను కంట్రోల్ చేయాలని ప్రయత్నించడం కూడా పిల్లల అధోగతిపాలు కావడానికి ఒక ముఖ్య కారణమైంది. చిన్నప్పుడు గురువు చేతిలో బెత్తం వద్దనే ప్రభుత్వాలు పెద్దయ్యాక పోలీసుల చేతిలో లాఠీల దెబ్బలు రుచి చూడండని చెబుతున్నట్టే ఉంది. ఈ విధంగా సమాజానికి ఏం సందేశం పంపాలనుకుంటోందో ఎవరికీ అంతుబట్టదు. విద్యార్థి మంచి దారిలో ఉండాలంటే కచ్చితంగా కొంత భయం ఉండాల్సిందే. చెబితే వినే వయసులో చెప్పనీయకుండా, చెప్పినా వినని వయసులో చెప్పించాలని చూస్తే పర్యవసానాలు ఇలాగే ఉంటాయి. దానితో చిన్నప్పటి నుంచి ఇంట్లో తల్లిదండ్రుల భయం లేకుండా, బయట గురువుల భయం లేకుండా కొందరు ఇష్టారీతిన చెలరేగుతున్నారు. కొన్నిసార్లు ఉపద్రవాలకు కారణమవుతున్నారు. తల్లిదండ్రులకు గుండెకోతకు గురి చేస్తున్నారు. అలాగే కరోనా పుణ్యాన ప్రతీ పిల్లవాడు ఇప్పుడు సెల్‌ఫోన్ కానీ ట్యాబ్ కానీ చేతుల్లో ఉండడం రివాజు అయింది. ఏదో గొప్పగా వారికి ఇప్పించామని సంబరపడి చంకలు గుద్దుకోకుండా వారు దానిని ఎలా ఆపరేట్ చేస్తున్నారు, అందులో ఏమేమి చూస్తున్నారు? అన్నది ఒక కన్నేసి గమనించాల్సిన బాధ్యత తల్లిదండ్రుల మీద ఉంది. ఒకప్పుడు పెద్దలు ఎక్కువగా తాము ఆచరించేవి, ఆచరించతగినవి మాత్రమే తమ కుటుంబ ఆర్థిక, సామాజిక కోణంలో విశ్లేషించి తమవారికి చెప్పేవారు కాబట్టి ఫలితాలు చక్కగా ఉండేవి. సోషల్ మీడియా విజృంభిస్తున్న ప్రస్తుత తరుణంలో రోజూ కొన్ని వందల వేలు సూక్తులు వస్తున్నాయి. కానీ దానిని ఆచరించేది ఎవరు? ఒక్క మాటలో చెప్పాలంటే చెప్పేవారు ఎక్కువయ్యారు, ఆచరించేవారు మాత్రం తక్కువయ్యారు.

### బీజం ఎక్కడ

ఈ విపరీత పోకడలకు ప్రధాన కారణాలు ఆధునిక సమాజం విశ్లేషించుకోవాల్సిన అవసరం ఉంది. విచ్ఛిన్నమవుతున్న కుటుంబ వ్యవస్థ, పతనమవుతున్న మానవీయ విలువలు యువతకు మనం ఎలాంటి భవిష్యత్తును ఇవ్వగలుగుతున్నామన్నది మనల్ని మనం ప్రతి ఒక్కరం ప్రశ్నించుకోవాలి. ఈ ధోరణులు కేవలం అత్యాశ వలన అందింది దల్లా హద్దుల్లేకుండా ఆస్వాదించాలన్న ప్రగాఢమైన కోరిక, చివరకు మనల్ని మనమే అంతం చేసుకుంటున్నామన్న స్పృహ కూడా లేకుండా చేస్తోంది. యువతలోని కొన్ని బలహీనతల్ని ఆసరాగా చేసుకుని ఆ బలహీనతల్ని సొమ్ము చేసుకోవాలన్న కొందరి దురాశ మొత్తం సమాజాన్నే వినాశనం చేస్తుంది. కొన్ని దేశాల్లో మత్తు



మత్తుమందుల వాడకం వలన ప్రపంచం మొత్తం వారిని దూరం పెట్టిన మాట మనకు కనువిప్పు కావాలి. మెక్సికో లాంటి కొన్ని దేశాలు, ఆఫ్రికన్ దేశాల్లో కేవలం గంజాయి, హెరాయిన్, కొకైన్ లాంటి మత్తుమందుల సరఫరా ద్వారానే ఉపాధి పొందుతున్నవారు అధికంగా ఉన్నారు. భారతదేశం లాంటి జనాభా అధికంగా ఉన్న దేశాలపై ఇలాంటి మాదక ద్రవ్యాల ప్రభావం పడితే భవిష్యత్ పరిణామాలు ఊహించడానికే కష్టం. ఈ మధ్యనే చూస్తున్నాం.. విశ్వ నగరంగా రూపు దిద్దుకుంటున్న హైదరాబాద్ లాంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో యువత ఆధునిక పోకడలను అత్యంత వేగంగా వంటబట్టించుకుంటుంది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో ఈ మధ్య గంజాయి వాడకం, అక్రమ రవాణా లాంటివి ఎక్కువ అయ్యాయయని పేపర్లలో మనం గమనిస్తున్నాం. కేవలం కొంతమంది పోలీసులు, నాయకులు మాత్రమే మనల్ని రక్షించాలి అనుకోవడం తప్పు. ప్రతీ తల్లీ, తండ్రీ, సమాజం కూడా తమ వంతు బాధ్యత తీసుకుని ప్రభుత్వానికి సహకరిస్తేగానీ ఈ జాడ్యాలను మనం నివారించలేం. అయితే దాన్ని నిరోధించాల్సిన గురుతర బాధ్యత మాత్రం ఎక్కువగా విద్యా వ్యవస్థ పైనే ఉంది. విశ్వ విద్యాలయాలలో, కాలేజీలలో అక్రమంగా డబ్బు సంపాదించడానికి కొంతమంది నాయకులు, ముఠాలు రేయింబవళ్లు ప్రయత్నిస్తున్నాయి. డబ్బు జబ్బు చేసిన విద్యార్థులను ఎరగా చేసుకుని నిదానంగా సమాజంలోని అన్ని రకాల వ్యక్తులకు ఈ రోగాన్ని అంటిస్తున్నాయి. కేవలం డబ్బు కోసం విలువైన మన సంస్కృతిని నాశనం చేస్తున్నాయి. ఇప్పటికైనా మేల్కొని నిజాయితీగా, నిబద్ధతగా మాదక ద్రవ్యాల వాడకం, సరఫరాలను అరికట్టా ల్సిన సామాజిక బాధ్యతను మనందరం తీసుకోవాలి.

### కొంచెం జాగ్రత్త!


యువతరం అనేది మన జాతి సంపద. దానిని నిర్వీర్యం చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది. ఆ.. నాకెందుకులే అనుకుంటూ– అయినా ఈ రోజు తగలబడింది పక్క ఇల్లు కదా నాది కాదు.. అనుకుంటే రేపటి రోజు నీ ఇల్లు తగలబడడానికి ఎంతో సమయం పట్టదు. ఇది ప్రమాదకరమైన అంటువ్యాధి లాంటిది. కరోనా కంటే భయంకరమైనది. తొందరగా వ్యాపిస్తుంది. అప్పుడు ఏడ్చినా కూడా ప్రయోజనం లేదు. అందుకే మన పిల్లలని జాగ్రత్తగా చూసుకోవాలి. మానసిక నిపుణులు చెబుతున్న దానిని బట్టి పిల్లల్లో కొన్ని లక్షణాలు గమనించినప్పుడే కొంచెం జాగ్రత్త వహించాలి. వారితో సన్నిహితంగా మాట్లాడి సమస్యని మరింత దగ్గరగా పరిశీలించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులదే. విద్యార్థులను కేవలం వినియోగదారులుగానే పరిగణిస్తూ, మా జీతం మాకు వస్తే చాలని ఆలోచించే కొందరి గురువుల మాదిరిగా కాకుండా పిల్లవాడి శారీరక, మానసిక వికాసానికి కాస్త చొరవ తీసుకొని కింది లక్షణాలలో ఏ కొన్ని గమనించినా ఆ విద్యార్థులపై నిశితంగా దృష్టి సారించాలి. అవి: క్రమంగా విద్యార్థి నీరసించిపోవడం, బాగా సరాసరిగా మార్కులొచ్చే విద్యార్థికి క్రమేపీ మార్కులు

తక్కువ రావడం, తరగతులకు రాకపోవడం లేదా ఆలస్యంగా రావడం, ఇతరులకు దూరంగా ఉండడం, జ్ఞాపకశక్తి తగ్గడం, వ్యక్తిగత దుస్తులు, శుభ్రత పట్ల అశ్రద్ధ, చురుకుదనం తగ్గడం, అదేపనిగా తరగతి గదిలో నిద్రపోవడం, అందరిలో అన్యమనస్కంగా ఉండటం, ప్రతి విషయంలోనూ నిస్సహాయత, నిర్లక్ష్యం పెరగడం, పొగరుగా మాట్లాడడం లాంటివి గమనిస్తూ తల్లిదండ్రులకు తెలియజేయాలి. తల్లిదండ్రులు కూడా అప్పుడప్పుడు వారు చదివే బడిని సందర్శించి పిల్లల గురించి విచారణ చేపట్టి తగు జాగ్రత్తలు పాటిస్తేనే మంచిది. అప్పుడే సమాజానికి మంచి పిల్లలను అందించిన వారమవుతాం.

## ముందే జాగ్రత్త పడాలి

మానవ వనరులను అత్యుత్తమంగా తీర్చిదిద్దే క్రమంలో విజయం సాధిస్తే ఏ దేశమైనా పురోగతి సాధిస్తుంది. సమాజాన్ని మార్చగలిగేది తల్లిదండ్రులు, ఉపాధ్యాయులేనని దివంగత రాష్ట్రపతి ఏపీజె అబ్దుల్ కలాం చెప్పిన విషయం మనం గుర్తుంచుకోవాలి. సమాజంలో మానవ విలువలు తరిగిపోతున్న తరుణంలో వాటిని పాదుకొల్పేలా మానవీయ కోణాన్ని ఆవిష్కరించాలి. చిన్న చిన్న సమస్యలకే కోపోద్రిక్తులై కన్నవారనీ, కట్టుకున్నవారనీ, నమ్మినవారనే తేడా లేకుండా హతమారుస్తున్న తీరు, ప్రాణాలు తీసుకుంటున్న వైనం చర్చనీయాంశంగా మారింది. సాటి మనిషిపై ప్రేమ, అభిమానాన్ని చూపాల్సిన మనిషి పగ, కక్ష అంటూ పాశవికంగా అంతమొందిస్తున్న తీరు కలవరపెడుతున్నది. ఫలితంగా నిందితులు కటకటాల పాలవుతూ కుటుంబ సభ్యులకు అవమాన భారాన్ని మిగుల్చుతుండగా, అటు అయినవారిని కోల్పోయి ఎన్నో కుటుంబాలు మానసిక వ్యథ పడుతుండడం కలచివేస్తోంది. అంతా అయిపోయిన తర్వాత బాధపడేకన్నా పిల్లలు ఎపుడు ఏం చేస్తున్నారు? ఎలాంటి స్నేహితులు ఉన్నారు? వారి దినచర్య ఏమిటి? అనేవి అప్పుడప్పుడు గమనిస్తూ ఉండాలి. అవసరమైతే ప్రేమగా మాట్లాడాలి. వారికీ తగిన సహాయం చేయాలి. ప్రేమను అందించాలి. చెడు అలవాట్ల వైపు నుండి మనసుని గతి తప్పించాలి. అప్పుడే రేపటి సమాజానికి ఒక మంచి వ్యక్తిని అందించినట్టు.

భారతదేశ భవిష్యత్తుకు వెన్నెముకగా నిలవాల్సిన యువత నేడు వెన్నముద్దలా కరిగిపోతున్నారు. అన్యాయాన్ని, అజ్ఞానాన్ని, అవినీతిని, రౌడీయిజాన్ని, ఫ్యాక్షనిజాన్ని, తీవ్రవాదాన్ని తిప్పిగొట్టగల సామర్థ్యం, సత్తా వుండేది నేటి యువతలో. భారతదేశానికున్న గొప్ప సంపద యువత. యువశక్తి అద్వితీయమైనది. అనన్య సామాన్యమైనది. ఆవేశాన్ని అరికట్టి ఆలోచనను పెంపొందించుకొని సరైన మార్గంలో యువతరం నడిస్తే మన దేశం ఎప్పుడూ స్వర్గసదృశ్యమే. ఆ క్రమంలో ఆధారం లేనివారికి ఆసరాగా నిలవాలి. అర్హులైనవారికి ఆనందం పంచాలి. వ్యవహారిక



శైలిలోనూ, భవిష్యత్తు వ్యవహారాలోనలోనూ మార్పు రావాలి. యువత కలిస్తే ఓ కొత్త ప్రపంచాన్నైనా సృష్టించగలరు. యువత ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోవాలి. సోమరితనాన్ని విడనాడాలి. అందరినీ నిష్కల్మషంగా ప్రేమించగలగాలి. అవినీతిని, అన్యాయాన్ని, అక్రమాలను ఎదురించాలి. దురాచార నిర్మూలనకు పాటుపడాలి. వ్యసనాలను బహిష్కరించాలి. మారుతున్న సమాజం మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నిపుణులు రూపొందించే ప్రత్యేక శిక్షణ యువతకు ఇవ్వాలి. ఆత్మవిశ్వాసాన్ని పెంచి సమాజానికి ఉపయోగపడే పౌరులుగా యువతను తీర్చిదిద్దాలి.

నేడు అంతరిస్తున్న మానవతా విలువలను చిగురింపజేస్తూ ప్రతి యువతీ యువకుడు గుండె బలంతో, నిండు మనసుతో ముందుకొచ్చి మంచి మనీషిగా ఎదగాలని కోరుకుందాం. దానికి 'పూవు పుట్టగానే పరిమళించినట్టుగా' బాల్య దశలోనే నీతికథలను బోధించాలి. మహనీయుల జీవిత చరిత్రలను తెలపాలి. వారు చేసిన త్యాగాలను వివరించాలి. మంచి మంచి కథలను వినేటట్టు చేస్తే మంచి పైన నమ్మకాన్ని కలిగిస్తే అందరిలోనూ ఉన్న మంచిని చూడగలిగే నేర్పు అలవడితే ఎవరికి వారు పరుల ప్రయత్నాలకు తమ చేయందిస్తారు. ఉన్నంతలో కలిసి వుండాలన్న తపన వారిలో మొదలవుతుంది. దానివల్లనే మన దేశ ఔన్నత్యం కాపాడే వీరులుగా పిల్లలు ఎదుగుతారు. వారే వసుధైక కుటుంబ వాంఛను ప్రపంచం నలుమూలలా వ్యాపింపచేస్తారు. ప్రపంచంలో అత్యుత్తమ దేశంలో భారతదేశాన్ని నిర్మించడంలో పాలుపంచుకుంటారు.

పిల్లలకు మంచేదో, చెడేదో చిన్నప్పుడు చెప్పకపోతే ఎప్పుడు వింటారు. అందుకే అంటారు పెద్దలు 'మొక్కయి వంగనిది మానై వంగునా' అని. చిన్నప్పటి నుండే మన స్థాయి, తాహతు ఇది అని చెబుతూ డబ్బు కంటే కూడా వస్తువు విలువ తెలియజేస్తూ, మానవ సంబంధాలను వారి హృదయాలలో నిర్మిస్తూ, గెలుపు ఓటములను సమాజంగా స్వీకరించే గొప్ప గుణాన్ని అలవరిస్తూ, వారితో జీవితం విలువ, బంధాల గొప్పదనం తెలియజేసేలా ప్రవర్తిస్తే ఇటువంటి అఘాయిత్యాలను ఇకనైనా ఆపగలం. లేదూ మేమింతే, మా పద్ధతి ఇంతే అని మొండిగా వాదిస్తే పైన చెప్పిన సంఘటనలే మన ఇంట్లో కూడా జరిగే రోజులు ఎంతో దూరంలో లేవు.

ఏ తల్లిదండ్రులు అయితే డబ్బు కంటే కూడా పిల్లల ప్రవర్తన బాగుండాలి, వారి భవిష్యత్తు అందంగా రూపు దిద్దుకోవాలి అని జాగ్రత్తలు చెబుతూ వారిని అనుక్షణం కంటికి రెప్పలా చూసుకుంటారో ఆ ఇల్లు నందనవనమై విరాజిల్లుతుంది. నలుగురికి ఆదర్శకంగా నిలబడుతుంది. ఎక్కడైతే డబ్బు జబ్బు చేసే విచ్చలవిడితనం రాజ్యం ఏలుతుందో అక్కడ ఏదో స్టేజ్‌లో ఇబ్బందులు నాట్యమాడుతున్నాయి. జీవితాలు భ్రష్టు పడుతున్నాయి. కాబట్టి తల్లిదండ్రులు తస్మాత్ జాగ్రత్త!

## పౌరుషాగ్నికి ప్రతిరూపు 'గులాం రసూల్‌ఖాన్'

ఈ దేశ స్వాతంత్ర్యం కోసం పరాయి దేశ వలస పాలనను అంతం చేయడంకోసం ఎందరో ముస్లిం దేశభక్తయోధులు తమ జాగీర్లు పాలించే విలువైన ప్రాంతాలు.. ప్రాణాల్ని సైతం తృణప్రాయంగా త్యజించిన వారెందరో వారి జీవిత చరిత్రలు నేడు మనం మన తరువాతి తరం అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత వుంది. ప్రాణాల నర్పించు, మాతృభూమిని కాపాడు.. అన్న రణ నినాదంతో బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా మొదలైన వహాబీ ఉద్యమంలో కీలకపాత్ర పోషించి తన జాగీర్‌ను సైతం త్యాగం చేసి ఉద్యమం కోసమే ప్రాణాలర్పించిన గొప్ప దేశభక్తుడు కర్నూల్ చివరి నవాబు గులాం రసూల్‌ఖాన్ పోరాట గాథను ఈ పుస్తకంలో విపులంగా రాసారు అజీజ్. బీజాపూర్ నవాబు ఆదిల్ షా తన సేనని అబ్దుల్ వహాబ్‌ను కర్నూల్ ప్రాంత పాలకునిగా 1602-1618 వరకు పాలించడం, ఔరంగజేబు- గోల్కొండ, బీజాపూర్



నవాబుల పాలనను ఎదిరించి ఓడించి తన ఏలుబడిలోకి తేవడం దగ్గర నుంచి ఈ నవల ఓ చరిత్ర నమూనాగా రాసారు రచయిత. వహాబీ ఉద్యమం ఆంగ్లేయ అధికార్లు, కలెక్టర్ల దౌర్జన్యం, పన్నులపై పీడించడం ఓ డాక్యుమెంటరీ చిత్రంలో రాసారు రచయిత. హైదరాబాద్‌లో బ్రిటిష్ రెసిడెంట్.. బ్రిటీష్ సైనికులు నిజాం సైనికులు కలిసి పని చేస్తుండటం.. ఉయాలవాడ నరసింహా రెడ్డితో గులాం రసూల్‌ఖాన్ లేఖ రాయడం, రెడ్డి బ్రిటీష్‌వారితో పోరాటం, 1846లో పట్టుపడి 1947లో ఉరి తీయబడటం, మేజర్ ఆర్మ్‌స్ట్రాంగ్ సైన్యంతో రసూల్ ఖాన్ తలపడటం, బంది అయి ఖైదీ కావడం, భోజనంలో విషం పెట్టి రసూల్ ఖాన్‌ను బ్రిటీష్‌వారు చంపడం పాఠకుల్ని కంటనీరు పెట్టిస్తుంది.

**(గులాం రసూల్ ఖాన్, రచన: యస్.డి.వి. అజీజ్, వెల: రూ 100, ప్రతులకు: 46/634, బుధవారపేట, కర్నూలు)**

**తంగిరాల చక్రవర్తి**

పుస్తక సమీక్ష

## అమరావతి ఉద్యమయాత్ర

పూర్వాంధ్ర ప్రదేశ్ రెండుగా విడిపోయినాక, 2014లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తమ రాజధాని నగరం విజయవాడ పరిసరాల్లో ఉండేట్లుగా నిర్ణయించారు. అప్పటి ప్రతిపక్షం అయిన వైయస్సార్ కాంగ్రెసు కూడా ఒప్పుకున్నట్లే అనిపించింది. సుమారు 30 వేలమంది రైతులు 34323 ఎకరాల తమ భూమిని ఇచ్చారు. 2019లో అధికారానికి వచ్చిన ప్రభుత్వం 'అధికార వికేంద్రీకరణ' పేరుతో మూడు రాజధానులను ప్రకటించింది. మారిన ఈ ప్రభుత్వ నిర్ణయాన్ని అమరావతి ప్రాంత ప్రజలు నిరసిస్తూ ఆందోళన చేపట్టారు. ఆందోళనకారులను ప్రభుత్వం తమ ఉక్కుపాదాలతో తొక్కే ప్రయత్నం చేసింది. 1 నవంబరు 2021న



అమరావతి ప్రాంత రైతులు 'న్యాయస్థానం నుంచి దేవస్థానం దాకా..' అంటూ పాదయాత్ర ప్రారంభించారు. ఈ ఉద్యమంలో మహిళలు ప్రముఖ పాత్ర వహించారు. 685 రోజులు సాగి తిరుపతిలో వెంకన్న పాదాల చెంత ముగిసింది. మహిళల చేతుల్లోకి వెళ్లిన ఈ ఉద్యమం పలు ప్రయాసలని ఎదుర్కొంది. పోలీసు అధికార బలాన్ని కూడా అధిగమించి సాగింది. ఈ గ్రంథ రచయిత పోపూరి శివరామకృష్ణ మౌలికంగా జర్నలిస్టు, రాజకీయ, వ్యవసాయ, కళారంగాలు ప్రీతి పాత్రాలు. ఈ మహా పాదయాత్రతో మమేకమై, ఉద్యమకారులతో కలిసి నడుస్తూ, తాను స్వయంగా చూసిన అనుభవాలను గ్రంథీకరించారు. ఉద్యమకారుల దీక్షను కన్నులకు కట్టినట్లు వివరించారు. ఎన్నో ప్రత్యేకతలను అందించారు. ప్రభుత్వాలు మారినపుడు నిర్ణయాలు మారటం సహజం. అయితే, ఆ నిర్ణయాల వల్ల ప్రజలకు నష్టం వాటిల్లకూడదు. అత్యున్నత న్యాయ స్థానం కూడా రైతులకు అనుకూలమైన తీర్పు ఇచ్చింది. చివరకు ఏది 'ఫైనల్' అవుతుందో వేచి చూడాల్సిందే! **(అడుగడుగు.. ఆశయ సాధనకే.., రచన: పోపూరి శివరామకృష్ణ, వెల: రూ. 200, ప్రతులకు: పి.శివరామకృష్ణ, యడ్లపాడు, గుంటూరు-522233)** **- కూర చిదంబరం**

## కె.గీత కవితలు, పాటలు 'అసింట'

అమెరికా కాలిఫోర్నియాలో తెలుగు భాషా నిపుణురాలిగా ఉద్యోగిస్తున్న ఉన్నత విద్యావంతురాలు కె.గీత పలు ప్రక్రియల్లో బహుగ్రంథ రచయిత్రి. తాజాగా 'అసింట' శీర్షికన కొన్ని వచన కవితలు, మరికొన్ని పాటలు జత పరిచి ఓ పొత్తం వెలువరించారు. స్త్రీ స్వేచ్ఛ, హక్కుల కోసం బలంగా నినదించే గొంతుక ఈ కవయిత్రిది. 'మా శరీరాల మీద, మా అవయవాల మీద, మా మనస్సుల మీద మగవాడికే కాదు.. న్యాయవ్యవస్థకీ హక్కు లేదు ప్రభుత్వానికీ హక్కులేదు' అంటున్న గీత వ్యక్తిత్వ వికాసాన్ని ప్రబోధిస్తూ కాలిఫోర్నియాలో ప్రతి నెలా ఒక సాహిత్య సమావేశం చొప్పున యిప్పటివరకు 85 సమావేశాలు నిర్వహించారు. 'దుప్పట్ల మీద దుప్పట్లు కప్పుకున్నా/ నీ వెచ్చని కౌగిలి లేక రాత్రంతా చలి ఎముకల్ని/ పరపరా నములుతూనే వుంది'



సున్నిత శృంగారాన్ని.. అంతలోనే ఓపలేని విరహాన్ని కలబోసిన కవితలు కొన్నింటిని ఆస్వాదించవచ్చు. అమ్మ అంటే ఎవరు? 'బంగారమంటి' పెళ్లాం అన్న నాన్న ధీమామాట ఒక్కసారి వినబడితే చాలు/ అతడి భుజాన బరువునీ, తన భుజాన వేసుకుని/ ఇంటినేం ఖర్మ.. భువనాన్నే మోస్తుంది' అందుకే అమ్మ ఒక వ్యక్తికాదు.. సమస్త 'అసింట' కవిత చదవండి.. దూరంగా నెట్టివేయబడుతున్న దళితుల పరిస్థితి అవగతమవుతుంది. కొన్ని జ్ఞాపకాలు, మరికొన్ని అనుభూతులు, ఇంకెన్నో భావనలు, ఆలోచనలు కలగలిపిన 13 పాటలలో తాత్వికత చిప్పిరిల్లినవీ లేకపోలేదు. చక్కటి బాణీలు సమకూర్చి పాడుకోవడానికి అనువుగా వున్నాయి. కె.గీత 'కవితలు-పాటలు' చదవండి.. అనుభూతించండి.

**(అసింట, రచన: డా॥కె.గీత, వెల: రూ 100, ప్రతులకు: అన్ని ప్రముఖ బుక్‌హౌస్‌లు)**

**- రమణ వెలమకన్ని**

## రెండు ఖండాల మధ్య నెలకొన్న దేశం

(7వ పేజీ తరువాయి)

రెండవ మొహమ్మద్ దీనికి అనేక మరమ్మత్తులు చేయించారు. పలు సందర్భాలలో జరిగిన అనేక పరిణామాల మధ్య దీనికి నాలుగు మినార్లు కూడా నిర్మించారు. 1481 నుండి 1512 మధ్య కాలంలో బయాజిద్ అనే సుల్తాను ఒక మినార్‌ను ఈశాన్యంలో నిర్మించారు. 1509లో వచ్చిన భూకంపలో ఒక మినార్ కూలిపోయింది. 16వ శతాబ్దంలో దెబ్బతిన్న రెండు మినార్లను పూర్తిగా కూల్చేసి ఒకదానికొకటి అభిముఖంగా ఉండేలా తిరిగి చక్కగా నిర్మించారు.

సుల్తాన్ సులేమాన్ హంగేరీ నుండి తెప్పించిన అతిపెద్ద కొవ్వొత్తుల స్టాండ్ ఈ మస్జిద్‌కు బహూకరించారు. అనంతరం 1 జూన్ 1453 శుక్రవారం హగియా సోఫియా మస్జిద్‌లో తొలి నమాజ్ చదివారు.

టర్కీ దేశపు తొలి అధ్యక్షుడు ముస్తఫా కెమాల్ అటటర్క్ ఈ మస్జిద్‌ను 1935లో మ్యూజియంగా మార్చి ఎంతగానో అభివృద్ధి చేశారు. లోపలి భాగంలో మార్బుల్స్ వేసి కార్పెట్లు పరచి కొత్త శోభను తీసుకువచ్చారు. ఒకప్పుడు పైకప్పుకు నెర్రెలు రావడంతో వర్షపు నీరు లోపలికి ప్రవేశించేది. వాటిని మరమ్మత్తులు చేయించారు. అమెరికన్ ఎక్స్‌ప్రెస్ అనే కంపెనీ సహాయంతో 1997 నుండి 2000 వరకు దీని కున్న రాగి డోమ్‌ను కూడా మరమ్మత్తులు గావించారు. ఒక మినారును ఎర్ర ఇటుక లతో నిర్మించారు. మిగిలిన మూడు మినారులను తెల్లని లైమ్‌స్టోన్, ఇసుక రాయిని కలగలిపి నిర్మించారు.

పై భాగాన ఒక గ్యాలరీని గుర్రపు నాడా ఆకారంలో నిర్మించారు. రాణివాసపు కాంతలు పై భాగంలో కూర్చొని ఇక్కడి విశేషాలను తిలకించేవారు. లోపలి భాగంలోని అలంకరణలు పరమాద్భుతంగా తీర్చిదిద్దారు. మొజాయిక్ డిజైన్లు, అద్దాలతో అందాలు, దివ్య ఖుర్‌ఆన్‌లోని సూక్తులు, ఏసుక్రీస్తు చిత్రాలు, చరిత్రకు అద్దం పట్టే విలువైన వస్తువులు ఇక్కడ చూడవచ్చు. కొన్ని చోట్ల నల్లని మార్బుల్‌ను కూడా ఉపయోగించారు. ఇప్పుడు హగియా సోఫియా మస్జిద్ ఒక పురావస్తు ప్రదర్శనశాలగా ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తోంది.

### నీలి మసీదు

ఇస్తాంబుల్‌లోని మరో అద్భుత నిర్మాణం నీలి వర్ణపు మస్జిద్. దీన్ని హగియా సోఫియా మస్జిద్‌కు సమీపంలో నిర్మించారు. నీలి రంగు రాతితో నిర్మించడం వల్ల దీన్ని బ్లూ మాస్క్ అని పిలుస్తున్నారు. కాన్‌స్టాంట్‌నోపిల్ పట్టణాన్ని అరబ్బులు ఆక్రమించుకున్నప్పుడు ఎందరో క్రైస్తవులు టర్కీకి వలస వచ్చారు. ఇలా ఎన్నో ప్రాంతాలవారు తుర్కియెలో స్థిర నివాసం ఏర్పరచుకోవడం వల్ల భిన్న సంస్కృతుల నిలయమైంది.

తుర్కియెలో పర్యాటక ప్రదేశాలు

### కప్పాడోసియా

పర్వత ప్రాంతాలను ఇష్టపడేవారికి ఈ ప్రదేశం బాగా నచ్చుతుంది. ఇక్కడ పర్వతాలు, ప్రకృతి దృశ్యాలు మనల్ని మరో ప్రపంచంలోకి తీసుకుని వెళతాయి. ఇక్కడి



కొండల్లో గుహలు చాలా ఉంటాయి. గుర్రపు స్వారీ, హాట్ ఎయిర్ బెలూన్స్‌లో షికారు ఇక్కడ అదనపు ఆకర్షణ. తుర్కియాలో హాట్ ఎయిర్ బెలూన్‌లలో విహరించేందుకు పర్యాటకులు ఉవ్విళ్లూరుతుంటారు.

### పాముక్కాలే

పాముక్కాలే అంటే పచ్చికోట అని అర్థం. ఈ ప్రాంతం ఏడాది పొడవునా సమశీతోష్ణ వాతావరణం కలిగి ఉంటుంది. ఇక్కడ ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడిన స్విమ్మింగ్ పూల్స్ కనిపిస్తాయి.

తుర్కియెలో చాలా ప్రశాంతంగా ఉండే ప్రదేశం సుమేలా మోనిస్టరి. తుర్కియెలో ఒంటెల పోటీలు జరుగుతాయి. ఈ దేశంలో యువత జనాభా అధికంగా ఉంటుంది. 82,693 మసీదులు దేశ వ్యాప్తంగా ఉన్నాయి. తులిప్ పూలు తుర్కియెలో విరగగాస్తాయి. ఈ పూలను విదేశాలకు కూడా ఎగుమతి చేస్తారు.

తుర్కియెలో మాంసాహారంతో తీపి పదార్థాలు చేయడం విచిత్రమనిపిస్తుంది. వీటి రుచి అద్భుతంగా ఉండి ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ దేశ ప్రజలు టీని మక్కువగా సేవిస్తారు.

తుర్కియెలోకెల్లా అందమైన గ్రామం గ్రుమూన్లూక్. ఇక్కడ ప్రకృతి అందాలు రమణీయంగా ఉంటాయి. రాజధాని నగరం అంకారా సమీపంలో పర్యాటక స్థలాలెన్నో ఉన్నాయి. మరో రమ్యస్థలం బోడ్రమ్. దీన్ని సెయింట్ టోపేజ్ ఆఫ్ టర్కీగా పిలుస్తారు. తుర్కియెలోని అన్‌తల్య మినార్ చాలా ప్రముఖమైంది. ఇంకా అడౌనా, బుర్సా, గజియాన్‌టేప్, మెర్సిన్, ఇజ్మీర్, ఇస్కెండెరెన్.. ఇలా ఎన్నో మహాద్భుత నగరాలు తుర్కియెలో ఉన్నాయి.

క్రీ.శ.1500లో పాలించిన సులేమాన్ కాలంలో ఒట్టోమాన్ సామ్రాజ్యం ఒక అద్భుత శక్తిగా భాసిల్లింది. ఇక్కడి కరెన్సీని టర్కిష్ లీరా అని పిలుస్తారు. ఈ దేశంలో గొర్రె ఉన్నితో అనేక రకాలైన వస్త్రాలు తయారు చేస్తారు.

తజ్‌బీల(జపమాల), జనమాజ్(ఈ వస్త్రంపై నిలబడి నమాజ్ చదువుతారు) తయారీలో తుర్కియె అందె వేసిన చేయి. ఈ తజ్‌బీలు, జనమాజ్‌లు ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఉన్న దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. సిల్కు, ఉన్ని కార్పెట్లు, నూలు అల్లికలు.. ఇలా ఒకదాన్ని మించి మరొకటి తయారు చేయడంలో తుర్కియె కళాకారులు సిద్ధహస్తులు.

తుర్కియె ప్రధానంగా వ్యవసాయిక దేశం. ఇక్కడ చెరకు ప్రధాన పంట. పత్తి, పొగాకు, పండ్లు కూడా పండిస్తారు. పశుపోషణ సమృద్ధిగా ఉంది. తుర్కియె వస్త్రాలకు ప్రపంచంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ వస్త్ర ఉత్పత్తులు ప్రపంచమంతా ఎగుమతి అవుతాయి. యంత్రసామాగ్రి, లోహాలు, ఎరువులు, పెట్రోలియం ప్రధాన దిగుమతులు.

ఇప్పుడు తుర్కియె గొప్ప పర్యాటక ప్రదేశంగా భాసిల్లుతోంది. ప్రతిరోజూ ప్రపంచం నలు మూలల నుండి తుర్కియె అందాలు తిలకించడానికి పర్యాటకులు వేల సంఖ్యలో వస్తుంటారు. పలు భాషల చలన చిత్రాలను ఇక్కడ చిత్రీకరించడం విశేషం. నేడు టర్కీ ప్రపంచ ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రదేశంగా భాసిల్లుతోంది.

# వెరైటీ రుచులు

## పనీర్ ఇడ్లీ

**కావలసిన పదార్థాలు**

శనగపిండి, గోధుమరవ్వ-అరకప్పు చొప్పున; పెరుగు-1 కప్పు; పనీర్-125



గ్రాములు(తురిమినది); క్యారెట్ ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, కొత్తిమీర తురుము-అరకప్పు చొప్పున; పసుపు-కొద్దిగా; టమాటముక్కలు-కొన్ని; ఉప్పు-తగినంత; నూనె-కొద్దిగా.

**తయారు చేసే విధానం**

ఒక గిన్నె తీసుకుని శనగపిండి, గోధుమరవ్వ, పెరుగు, క్యారెట్ ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, కొత్తిమీర తురుము, టమాటముక్కలు, పసుపు వేసి బాగా కలిపి, పదిహేను నిమిషాలు పక్కనే పెట్టుకోవాలి. తర్వాత పనీర్ తురుము కలుపుకుని, తగినంత ఉప్పు వేసి.. ఇడ్లీ పాత్రలకు నూనె రాసి కొద్ది కొద్దిగా పిండి వేసుకొని ఆవిరిపై ఉడికించుకోవాలి. ఆవాలు, కరివేపాకు, పుదీనాతో తాలింపు వేసుకుని ఆ మిశ్రమాన్ని ఇడ్లీల పైన గార్నిష్ చేస్తే రుచికరమైన ఇడ్లీలు రెడీ.



## మ్యాగీ వడ

**కావాల్సిన పదార్థాలు**

మ్యాగీ-3(రెండున్నర స్లైస్‌లను ముందుగా ఉడికించి, నీళ్లు వడకట్టి పక్కన పెట్టుకోవాలి. మిగిలింది చిన్న చిన్న ముక్కల్లా చేసుకుని పక్కన పెట్టుకోవాలి); క్యారెట్ తురుము, బీట్‌రూట్ తురుము-పావు కప్పు చొప్పున; పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర తురుము, ఉల్లిపాయ ముక్కలు-కొన్ని; కారం, పసుపు, గరంమసాలా-1 టీ



స్పూను చొప్పున; మొక్కజొన్న పిండి-2 టేబుల్ స్పూన్లు; మైదాపిండి-5 స్పూన్లు(నీళ్లు పోసి దొప్పలా చేసుకోవాలి); నూనె-డీప్ ఫ్రైకి సరిపడినంత.

**తయారు చేసే విధానం**

ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో ఉడికిన మ్యాగీ(చల్లారిన తర్వాత), క్యారెట్ తురుము, బీట్‌రూట్ తురుము, పచ్చిమిర్చి ముక్కలు, మొక్కజొన్న పిండి, కొత్తిమీర తురుము, ఉల్లిపాయ ముక్కలు, కారం, పసుపు, గరం మసాలా, పెరుగు అన్నీ జోడించి బాగా కలిపి ముద్దలా చేసుకోవాలి. తర్వాత ఆ మిశ్రమాన్ని చిన్న చిన్న వడల్లా చేసుకుని, మైదా తోపులో ముంచి, మ్యాగీ ముక్కల్లో కలిపి నూనెలో దోరగా వేయించుకోవాలి.



## పిస్తా-కాఫీ కేక్

**కావలసిన పదార్థాలు**

పిస్తా ముక్కలు-ఒకటిన్నర కప్పులు(దోరగా వేయించి మిక్సీ పట్టుకోవాలి); గుడ్లు-5; వెన్న-పావు కప్పు; బేకింగ్ పౌడర్-1 టీ స్పూన్; మైదా పిండి-3 టేబుల్ స్పూన్లు; ఉప్పు-అర టీ స్పూను; కాఫీ ఎసెన్స్-అర టీ స్పూను; నెయ్యి-కొద్దిగా.

**తయారు చేసే విధానం**

ముందుగా చిన్న బౌల్ తీసుకుని, అందులో మైదా పిండి, బేకింగ్ పౌడర్, ఉప్పు వేసుకుని కలిపి పక్కన పెట్టుకోవాలి. మరో పెద్ద బౌల్ తీసుకుని అందులో వెన్న, గుడ్లు వేసుకుని బాగా కలపాలి. మెత్తగా అయ్యేంత వరకూ కలిపి మైదాపిండి మిశ్రమాన్ని వేసి మళ్లీ కలుపుతూ క్రీమ్‌లా చేయాలి. పిస్తా మిశ్రమాన్ని జోడించి బాగా కలపాలి. తర్వాత గుండ్రటి బేకింగ్ టిన్‌కి నెయ్యి రాసి అందులో ఈ మిశ్రమాన్ని మొత్తం వేసుకుని సమాంతరంగా చేసుకోవాలి. 180 డిగ్రీస్‌లో యాభై నిమిషాల పాటు ఓవెన్‌లో బేక్ చేసిన తరువాత అభిరుచి మేరకు గార్నిష్ చేసుకోవచ్చు.





కథ

# పచ్చని మా పల్లె

**గోకులాపురం** గ్రామంలో ఎక్కడ చూసినా పచ్చదనంతో, జీవరాశులతో కళకళలాడుతూ ఉండేది. కోయిల స్వరాలు, తీయని పలకరింపులు, అతిథులు వస్తే చేసే మర్యాదలతో ఆ గ్రామం చాలా చక్కగా విలసిల్లేది. గ్రామానికి ఒకవైపు దట్టమైన అడవి ఉండేది.

గ్రామ ప్రజలు చెట్లను దేవతగా ఆరాధించేవారు. చెట్లను నరకడం, కూల్చివేయడం, కాల్చడం వంటివి చేసేవారు కాదు. అత్యవసరంగా చెట్లను నరకవలసి వస్తే ఒక మొక్కను నాటేవారు. ఇలా ఆ గ్రామంలో అడవి సురక్షితంగా ఉండేది. అంతేకాకుండా అంటురోగాలు లేకుండా, పరిశుభ్రమం అయినటువంటి ఊరుగా కనిపించేది.




వేసవి సెలవులకు పట్నంలో చదువుకునే పిల్లలు గ్రామానికి వచ్చారు. వాళ్లు తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలనుకున్నారు. గ్రామస్తులతో మాట్లాడి, అవి మొత్తం నరికివేసి కలపను అమ్మాలని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని నిర్ణయించారు. పెద్ద పెద్ద భవనాలను నిర్మించి అందమైన కాలనీగా తీర్చిదిద్దాలని అనుకున్నారు.


అమాయక గ్రామస్తులు వారి మాటలు విని ఒప్పుకున్నారు. కొద్ది రోజుల్లోనే పచ్చగా కళకళలాడే అందమైన అడవి నిర్మానుష్యంగా మారింది. ఉన్నఫళంగా గ్రామస్తులకు తెలియని వింత రోగాలు వచ్చాయి. వాతావరణ కాలుష్యం ఎక్కువైంది. అంటురోగాల వైరస్ వ్యాపించి అందరూ రోగాల బారిన పడ్డారు. పట్నంలోని పెద్దాసుపత్రికి చికిత్స కోసం వెళ్లారందరు. డాక్టర్ చెప్పిన విషయం ఏమిటంటే- "మీ గ్రామం పూర్తిగా కలుషితమైంది. స్వచ్ఛమైన గాలి అందాలంటే వెంటనే మీరు యుద్ధ ప్రాతిపదికన చెట్లను పెంచమని సలహా ఇచ్చాడు. వెంటనే గ్రామస్తులందరూ సమావేశం ఏర్పరచుకొని గ్రామంలో ఎక్కడా ఖాళీ ప్రదేశం కనిపించినా చెట్లను నాటడం ప్రారంభించారు. అనతి కాలంలోనే చెట్లు పెరిగి పెద్దవై చక్కటి గాలిని ఇచ్చాయి. ఇప్పుడు ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నారు. ఇక చెట్లను నరకకూడదని మూకుమ్మడిగా ప్రతిజ్ఞ చేశారు.

నీతి: చెట్లను మనం రక్షిస్తే అవి మనల్ని రక్షిస్తాయి.

**- పి.స్నేహలత,** రాయిలాపూర్



రంగులు వేయండి



చుక్కలు కలపండి






## బాలగేయం

### సెలవుల్లో..



పందుగ సెలవులకు
మా ఊరికెళ్లాను
అందమైన గ్రామం
స్వచ్ఛతకు చిహ్నం
చెరువులు, బావులు
నీళ్లతో నిండుకున్నాయ్
పట్నం నుంచి
చాలామంది వచ్చారు
అందరం
స్నేహితులయ్యాం
తాతయ్యలు ఆరుబయట
ఆప్యాయంగా
మాట్లాడుకున్నారు
అమ్మమ్మలు, నాన్నమ్మలు
మాకందరికి
పిండివంటలు వడ్డించారు
పల్లె రుచులతో
మేం ఆనందించాం..
కొత్తబట్టలేసుకున్నాం.

**- సండె డెస్క్**

## హలో ఫ్రెండ్...

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- సి. ప్రభాకర్,** కేశంపేట

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. జట్రోఫా చెట్టు ప్రత్యామ్నాయ ఇంధన వనరు ఎలా అయింది?

**జవాబు:** ప్రభాకర్! జట్రోఫా చెట్టు గింజల నుంచి తీసిన చమురు సంప్రదాయ ఇంధన, శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయం కాగలదని నిపుణుల అభిప్రాయం. వాహనాలకు ఇంధనంగానే కాకుండా, వంటకు, విద్యుదుత్పత్తికి సైతం దీనిని ఉపయోగించవచ్చని వారు భావిస్తున్నారు.




దీని విత్తనాలలో నూనె ఉంటుంది. దీనిని సంప్రదాయక ఇంధనాలైన గ్యాసోలిన్ లేదా డీజిల్‌లతో కలిపి మిశ్రమం చేస్తే 'బయోడీజిల్' అవుతుంది. ఒక మిలియన్ టన్నుల బయోడీజిల్ పొందడానికి ముందుగా 1.5 మిలియన్ హెక్టార్ల భూమిలో జట్రోఫా సాగు చేయాల్సి ఉంటుంది.

శిలాజ ఇంధనంతో పోల్చినప్పుడు స్వచ్ఛమైన బయోడీజిల్ డెబ్బై శాతం తక్కువ హైడ్రోకార్బన్‌ను, ఎనభై శాతం తక్కువ ఇతర కారకాలు, సల్ఫర్ తదితరాలను విడుదల చేయడంతో పర్యావరణానికి అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు. బయోడీజిల్‌ను ఒక మిశ్రమ ఇంధనంగా ఉపయోగించుకోవాలన్నది మన దేశ విధానంగా రూపు దిద్దుకున్నది. నీటిపంపు, పవర్ జనరేషన్ సెట్స్, ట్రాక్టర్లు, ఇతర వాహనాలను విజయవంతంగా నడపడానికి బయోడీజిల్ ఉపయోగపడుతుందని తేలింది. మన దేశంలో డైమ్లర్ క్రిస్లర్ ఇండియా, సెంట్రల్ సాల్ట్ అండ్ మెరైన్ కెమికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(భావ్‌నగర్) మొదలైన అనేక సంస్థలు దీని మీద ప్రాజెక్టులు నిర్వహించాయి.

# ప్రపంచ వింతలు

## అత్యంత ఖరీదైన గుడ్లు

**ప్రో**టీన్‌కు బెస్ట్ సోర్స్ ఏమిటని చిన్న పిల్లాడిని అడిగినా గుడ్డు అనిన ఠక్కున చెబుతాడు. గుడ్లు విలువ బాగా తెలిసింది కరోనా సమయంలోనే. పోషక పదార్థాల గని గుడ్లు.

ప్రతీ రోజూ వీటిని తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వీటిలో కాల్షియం, విటమిన్ డి పుష్కలంగా ఉంటాయి. ఈ గుడ్ల ధర 4 నుండి మంచి డిమాండ్ రోజుల్లో 6 రూపాయల వరకూ ఉంటుంది. అయితే కొన్ని రకాల గుడ్లు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవి ఉన్నాయి. ఇవి కోడి గుడ్లు కాదు. బ్రిటీష్ దేశంలో లభించే 'గల్ గుడ్లు' ధర చాలా ఎక్కువ. గ్లాకస్ వింగ్డ్ గల్ అనే పక్షి పెట్టే గల్ ఎగ్స్‌ను ఇంగ్లాండ్ వాసులు ఎంతగానో ఇష్టపడతారు. ఈ గల్ గుడ్లు చాలా అరుదుగా లభిస్తాయి. ఏడాదిలో ఒక సీజన్‌లో మాత్రమే దొరికే ఈ గుడ్లకు విపరీతమైన డిమాండ్ ఉంటుంది. సంవత్సరం మొత్తంలో కేవలం నాలుగు వారాలు మాత్రమే ఈ గుడ్లు అందు బాటులో ఉంటాయి.

సాధారణంగా గల్ పక్షులు ప్రతీ ఏటా



ప్రారంభంలో తమ గూళ్లను నిర్మించు కోవడం ప్రారంభిస్తాయి. ఏప్రిల్ చివరి నాటికి లేదా మే నెల ప్రారంభంలో అవి గుడ్లు పెట్టడం ప్రారంభించగా, జూన్ 15వ తేదీతో సీజన్ ముగుస్తుంది. ఏదైనా రెస్టారెంట్స్, దుకాణాలు లేదా డిస్ట్రిబ్యూటర్స్ గల్ ఎగ్స్ స్టాక్ కలిగి ఉన్నట్లయితే వాటిని జూన్ నెలాఖరులోపు తప్పనిసరిగా విక్రయించాలని అక్కడ చట్టాలు చెబుతున్నాయి. అందుకే వీటికి డిమాండ్ కూడా ఎక్కువే. రుచి విషయానికి వస్తే చాలా బాగుంటాయి. వీటిని ఎక్కువగా బాయిల్డ్ చేసుకుని తింటారు. ఒక్కో గుడ్డు ధర 800 నుండి 1,000 రూపాయలు ఉంటుంది. ఇక 'పిట్ట గుడ్లు' చాలా చిన్న చిన్నగా ఉంటాయి. పిల్లలు ఆడుకునే గోళీల సైజులో ఉంటాయి. ఈ గుడ్డు చిన్నగా ఉన్నా వీటి ధర మాత్రం భారీగానే ఉంటుంది. వీటి ధర డజన్ 600 రూపాయల నుండి 700 రూపాయల వరకూ ఉంటుంది. వీటిని ఉడకపెట్టడానికి చాలా తక్కువ సమయం పడుతుంది. 'ఈము గుడ్లు' చాలా పెద్దగా ఉంటాయి. ఒక్కో కోడిగుడ్డు దాదాపు పదిహేను కోడి గుడ్లకు సమానంగా ఉంటుంది. ఈ గుడ్లతో చేసిన వంటకాల రుచి అద్భుతంగా ఉండటం వల్ల వీటికి డిమాండ్ భారీగా ఉంటుంది.

సాధారణంగా ఈము కోళ్ళ నవంబర్ నుండి మార్చి మధ్య కాలంలో గుడ్లు పెడతాయి.



ప్రతీ కోడి మూడు లేదా నాలుగు రోజులకు ఒకసారి చొప్పున ఒక్కో సీజన్‌కు సగటున ముప్పై గుడ్లు పెడతాయి. వీటి పొదిగే కాలం 46 నుండి 56 రోజుల వరకూ ఉంటుంది. ఈము గుడ్డుతో చేసిన ఆమ్లెట్ తింటే మనం తినే ఫుల్ భోజనం కంటే మించి ఉంటుంది. అంత పెద్దదిగా ఉండే ఈ గుడ్డు రుచి కూడా అంతే అద్భుతంగా ఉంటుంది. రుచికి, సైజుకు తగినట్లే దీని ధర చూస్తే కళ్లు బైర్లు కమ్మాల్సిందే! ఒక్కో గుడ్డు ధర 2,000 రూపాయల నుండి 5,000 రూపాయల వరకూ పలుకుతుంది. ఈము కోళ్లను వాటి మాంసం, చర్మం, నూనె, గుడ్లు, ఈక లను ఉపయోగించుకోవాలంటే తప్పని సరిగా లైసెన్స్ తీసుకోవాల్సిందే.

'టర్కీ గుడ్లు' గురించి తెలుసుకుంటే వీటి రుచి నాటు కోడి గుడ్ల రుచిని పోలి ఉంటుంది. కానీ కోడి గుడ్ల కంటే ఎక్కువ పోషకాలను కలిగి ఉండే ఈ గుడ్లు కొంచెం పెద్దవిగా ఉండటంత పాటు, షెల్ కొద్దిగా పటిష్టంగా ఉంటుంది. టర్కీలు గుడ్లు పెట్టడానికి వయస్సు పడుతుంది. ఇందువల్ల ఈ గుడ్లు చాలా అరుదుగా ప్రధానంగా వాణిజ్య పరంగా విక్రయించబడతాయి. టర్కీలు గుడ్లు పెట్టే సమయంలో వారానికి రెండు మాత్రమే లభిస్తాయి. టర్కీ గుడ్లు ఒక రుచికరమై నవి. ఇవి కోడి గుడ్డును పోలి ఉన్నప్ప టికీ, కచ్చితంగా ఎక్కువ పోషకాలను కలిగి ఉంటాయి. ఈ గుడ్లు డజన్ ధర 3 వేల రూపాయలకు పైగా ఉంటాయి.

# ప్రపంచంలోనే అతి పెద్ద పక్షి



ప్రపంచంలో అతి పెద్ద పక్షి ఏది అన గానే అందరూ ఆస్ట్రిచ్ లేదా నిప్పుకోడి అని చెబుతారు.

కానీ ఆస్ట్రిచ్ కంటే డబుల్ సైజులో ఉండే పక్షులు ఉన్నాయి. దాని పేరే ఏపియోర్నిస్. సింపుల్ భాషలో చెప్పాలంటే దాన్ని ఏనుగు పక్షి అంటారు. ఎందుకంటే అది ఏనుగు ఎంత పెద్దగా ఉంటుందో అంత పెద్దగా ఉంటుంది. చాలా అరుదుగా ఉండే ఈ పక్షి ఆఫ్రికాకు ఆగ్నేయంగా ఉండే అతి పెద్ద దీవి మడగాస్కర్‌లో కనిపించాయి. రోడ్డుపై లారీ వెళితే మన కాళ్ల కింద కదిలినట్లు ఎలా అనిపిస్తుందో అలా ఈ ఏనుగు పక్షి నడుస్తూ వెళ్లే భూమి కదలినట్లుగా ఉంటుంది.

ఈ పక్షికి రెక్కలు ఉండవు. అందువల్ల ఎగిరేవి కావు. నడుస్తూ, పరుగెడుతూ ఉంటాయి. ఇవి న్యూజిలాండ్‌లోని కివీ పక్షిని పోలినట్లు ఉంటాయి. ఈ పక్షి ఒక్కోటీ ఆరు వందల కేజీల వరకూ బరువు పెరుగుతాయి. అయితే ఇవి ప్రస్తుతం ఎక్కడా కనిపించే పరిస్థితి లేదనీ. వేటగాళ్ల వల్ల అవి అంతరించి పోయి ఉంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

ఆస్ట్రిచ్‌లతో పాటు ఏపియోర్నిస్ సైతం అంతరించిపోయే దశలో ఉన్నాయి. ఉన్నవాటిని కాపాడుకుంటూ వాటి సంఖ్యను పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే అంతరించిన ఏపియోర్నిస్‌ను తిరిగి పుట్టించేందుకోసం కూడా ప్రయోగాలు జరుగుతున్నాయి.

ఈ పరిశోధనల్లో ఓ ఆశ్చర్యకరకమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏపియోర్నిస్ పక్షులు మొదట్లో గాలిలో ఎగిరేవని గుర్తించారు. వీటి జాతికి చెందిన పక్షులు న్యూజిలాండ్‌లో కివీ రూపంలో ఉన్నాయని అంటున్నారు.

మడగాస్కర్ పూర్తి స్థాయి దీవిగా మారిన తరువాత ఈ ఏపియోర్నిస్ పక్షల శరీర నిర్మాణంలో మార్పులు చోటు చేసుకుటున్నాయి. ఫలితంగా వాటి రెక్కలు పోయాయి.

ఈ పక్షుల డిఎన్ఎ, కివీ పక్షుల డిఎన్ఎని పోల్చిన ప్పుడు ఈ విషయాలు వెలుగుచూశాయి.

# నేలపై వాలని పక్షి

పక్షుల్లోనే ఈ పక్షి చాలా ప్రత్యేకమై నది. దానికి కొన్ని ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి. నేలపై అసలు వాలకపోవడం, పొడుగైన చెట్లపై మాత్రమే గూడు కట్టుకోవడం, సిగ్గు పడటం వంటి విచిత్ర లక్షణాలు ఈ పక్షికి ఉన్నాయి. దాని పేరే హరియల్ పక్షి లేదా హారోలీ పక్షి అంటారు.

హరియల్ పక్షి చూడటానికి రూపురేఖలు పావురంలా ఉన్నా, కలర్ మాత్రం చిలుకలా ఉంటుంది. దీన్ని పసుపు కాళ్ల పచ్చ పావురం అంటారు. దీని సైంటిఫిక్ నామం ట్రెరాన్ ఫోనికాప్టెరస్.

ఈ పక్షి ఎక్కువగా పాకిస్థాన్, శ్రీలంక, నేపాల్ దేశాల్లో ఉన్నాయి. మన దేశంలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా కన్పిస్తుంది. మహారాష్ట్రలో ఈ పక్షి ఎక్కువగా కనిపించదు కాని ఆ రాష్ట్ర పక్షిగా అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. చూడటానికి పావురాల వలె ఉన్నప్పటికీ ఇవి వాటిలా గింజలు తినవు. చిలుకల లాగ పండ్లు, పూల మొగ్గలు, ధాన్యాల వంటి వాటిని తింటాయి. గుంపులుగా ఎగురుతాయి కాని నేలపై అసలు వాలవు. వీటిని చూడాలంటే పగటి వేళే సరైంది. ఆ సమయంలో ఇవి దట్టమైన అడవుల్లో అతి ఎత్తైన చెట్లపై కనిపిస్తాయి. చెట్ల కొమ్మలపై జంటలుగా వాలి కనిపిస్తాయి. పావురాలు చెట్లపై గూళ్లు కట్టుకోవు అయితే ఈ పక్షులు చెట్ల మీద కట్టుకుంటాయి. కానీ అత్యంత ఎత్తుగా ఉండే చెట్లపైన మాత్రమే గడ్డి పరకలు, ఆకులతో గూళ్లు కట్టుకుంటాయి. ఈ పక్షలు అసలు నేలపై ఎందుకు వాలవనే దానిపై శాస్త్రవేత్తలు ఇప్పటికీ గుర్తించలేకపోయారు.

పావురాలు, చిలుకలు నేలపై వాలతాయి కానీ అలాంటి కొన్ని లక్షణాలు ఉన్న ఈ పక్షులు ఎందుకు నేలపై వాలవనేది తేలాల్సిన ప్రశ్నగా మిగిలి పోయింది. ఇవి నేలపై వాలాలంటే అందుకు తగిన అవసరం ఉండాలని, అటువంటి అవసరం లేదు కావట్టే అవి కిందికి దిగడం లేదనే వాదన ఉంది.

ఆహారం కోసం పండ్లను తినే ఇవి చెట్ల పైనే వాటిని సేకరిస్తాయి. నీటి కోసం కూడా చెట్ల పైనే ఈ పక్షులు ఆధార పడుతున్నాయి. పండ్లలో ఉండే నీటిని ఈ పక్షలు పొందుతున్నాయి. అలాగే చెట్లపై పడే మంచు నుండి తయారయ్యే నీటి బిందువులను ఈ పక్షులు తాగుతు న్నాయి. అందువల్ల వీటికి నేలపై



వాలాల్సి న అవసరం రావడం లేదని అంటున్నారు.

కాగా ఈ పక్షులకు మొహమాటం ఎక్కువ. ఎప్పుడూ సైలెంట్‌గా, డల్‌గా ఉంటాయి. ఇవి తెగ సిగ్గుపడుతాయి. చిన్న అలికిడి అయినా ఇక అక్కడ ఉండకుండా ప్రశాంతంగా ఉండే చోటికి వెళ్లిపోతాయి.

మనుషులంటే వీటికి మరీ భయం. మనుషులను చూస్తే చాలు... ఆ దరిదాపుల్లో మళ్లీ కనిపించవు. ఏ ఆపదలూ రాకుండా జాగ్రత్త పడుతూ జీవిస్తుండడతోనే ఈ పక్షులు ఇరవై ఆరేళ్ల వరకూ జీవిస్తాయి.

**- సిహెచ్‌వివి రఘుబాబు**

కథ


# మర్యాదలు

చిట్టత్తూరు మునిగోపాల్

**డోర్ తీసుకుని లోనికొచ్చాడు హర్ష. రెండు చేతుల్లో రెండు క్యారీ బ్యాగులు. ఒకదాంట్లో కూరగాయలు, రెండో బ్యాగులో ఏవో ఇంటికి కావాల్సిన సరుకులున్నాయి.**

**తన వద్దనున్న రెండో తాళంచెవితో బయటినుంచే లాక్ ఓపెన్ చేసి, కాలింగ్ బెల్ అసవరం లేకుండానే హఠాత్తుగా అల్లుడుగారు ఇంట్లో దూరేసరికి బిత్తరపోయింది మా ఆవిడ.**

హాల్లో ఉన్న సోఫాలో రెండు కాళ్లూ బార్లా జాపేసి, ఎడమ మోచేతిపై తలను ఆన్చి కుడి చేతిలో రిమోట్ పట్టుకుని పాలకడలిపై శేష తల్పమున శయనించిన విష్ణుమూర్తి ఫోజుతో టీవీలో సీరియల్ చూస్తున్నదల్లా ఠక్కున లేచి అల్లుడికి గౌరవమివ్వబోయింది. ఈవిడ మర్యాద సరే, ఇన్నాళ్లూ ఇంటిల్లిపాదికీ చాకిరీ చేసి చేసి అరిగి తరిగిపోయిన ముసలి ఎముకలకు ఓపికుండొద్దూ.. నడుం కలుక్కుమని లేవలేక 'కుయ్' మంటూ మూలిగి గతుక్కుమని చూసింది. అప్పటికే అల్లుడి చేతిలోంచి బ్యాగులు అందుకోవడానికి పైకి లేచిన నా వంక చూసింది.



నవ్వొచ్చింది నాకు. ఆపుకున్నాను, ఉడుక్కుంటుందని.

"అయ్యో, నడుం పట్టేసిందా అత్తయ్యా, అయినా మీరెందుకు లేవడం, పడుకోండి.. పడుకోండి ఎన్నిసార్లు చెప్పినా వినరు కదా! మామయ్యా! మీరూ తప్పుకోండి. నేను లోపల పెడతాను కదా. అసలే కరోనా కాలం. బయట ఎక్కడెక్కడో తిరిగేసి వచ్చాను, మట్టుకోవద్దు" అని వారిస్తూ కిచెన్‌లోకి వెళ్లి బజారు నుంచి తెచ్చిన సరుకులు సింక్ దగ్గరే పెట్టి, నేరుగా బాత్ రూంలో దూరిపోయాడు అల్లుడు.

హాల్లో ఇంత జరుగుతున్నా పక్కనే డోర్ తెరిచే ఉంచిన బెడ్ రూమ్‌లోని మాస్టర్ బెడ్ మీద పిల్లోకు చేరగిలబడి అలసటగా కళ్లు మూసుకుని భవ్యలో మాత్రం ఉలుకూ పలుకూ లేదు.

పైగా "అమ్మా.. బాత్ రూంలోంచి ఫ్రెషప్ అయి రాగానే నాకు కాస్త కాఫీ కలిపి ఇవ్వమని ఆయనకు చెప్తావా?" చెపింది క్యాజువల్‌గా. ఆ పురమాయింపుతో శాంత అదే ఆవిడకు చిర్రెత్తుకొచ్చింది.

"ఇటు పుల్ల అటు ఎత్తిపెట్టనివ్వకుండా నెత్తిన పెట్టుకుని నిన్ను నేనే చెడిపేశానే. నిన్నని ఏం లాభం, నా పెంపకం అలా ఏడ్చింది. అందుకు నన్ను నేను చెప్పుతో కొట్టుకోవాలి" ఇంకా ఏదో అనబోయేలాగనే అల్లుడు హాల్లో ఎదురయ్యాడు.

"ఏంటత్తయ్యా, భవీ మీద మళ్లీ దండెత్తినట్టున్నారు.. పాపం, అలిసిపోయి ఉంటుంది. నేను రాత్రి కదా కూర్చోవాలి. ఇప్పుడే మనందరికీ కాఫీ కలుపుకుని వస్తానుండండి". ఎప్పుడు వీళ్లిద్దరి సంభాషణ విన్నాడో... నీళ్లు ఇంకా కారుతున్న తల తువ్వాలుతో తుడుచుకుంటూనే కిచెన్‌లోకి దూరాడు హర్ష.

కూతురూ, అల్లుడూ ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే. బెంగళూరులో ఒకే కంపెనీలో పని చేస్తుండగా పరిచయమైంది. అభిరుచులు కలిసాక డేట్ కూడా చేశారేమో మాకు తెలియదు. మా వరకూ ప్రేమ విషయం వచ్చాక పెళ్లి చెయ్యడానికి ఎటువంటి అభ్యంతరం కనబడలేదు. కరోనా విరుచుకుపడడానికి సరిగ్గా నెల ముందు పెళ్లయిపోయింది. తర్వాత విజృంభించిన కోవిడ్, ఆపైన వచ్చిపడ్డ లాక్‌డౌన్ పరిస్థితులతో వాళ్లక్కడికి శ్రీకాళహస్తికి మా వద్దకు రావడానికి, మేమైనా ఇక్కడికి రావడానికి వీలు కాకుండా పోయింది. అయితే అమ్మాయితో పాటు అల్లుడూ పోరు పెట్టడంతో వారం రోజుల ముందే బెంగళూరు వచ్చాం. ఇంకా పిల్లలు లేరు వారికి.

అబ్బాయి తల్లిదండ్రులు హైదరాబాద్‌లో పెద్ద కొడుకు దగ్గర ఉంటున్నారు. అల్లుడికీ, కూతురికీ మధ్య ఏ సరదాలూ, సరసాలూ సాగకుండా అడ్డుగా ఉంటున్నామన్న బాధే కానీ వారిలో అటువంటి భావమేమీ కనిపించదు మాకు. వారిద్దరి అన్యోన్యం చూస్తుంటే చాలా ముచ్చటేస్తుంటుంది. "అయ్యయ్యో! అబ్బాయి కాఫీ కాసి మనకు ఇవ్వడమేమిటండీ! దానికి సిగ్గు లేకపోతే మనకుం డొద్దా.. నేను వెళ్లి కలుపుకొస్తా. ఇలా వచ్చి నాకు కొంచెం చేయందించి లేపండి" మళ్లీ న్యూస్ పేపర్ పఠనంలో మునిగిపోయిన నన్ను పిలిచింది శ్రీమతి.

సరేనంటూ లేచివెళ్లి చెయ్యి అందించాను. నడుందాకా కష్టంమ్మీద లేపగలిగింది కానీ మోకాళ్లు పట్టేడయంతో "అమ్మా" అంటూ అలాగే తిరిగి కూలబడింది సోఫాలో.

ఆరోగ్యం ఏమాత్రం సహకరించకున్నా అల్లుడికి తెగ మర్యాదలు చేసెయ్యాలన్న దాని తాపత్రయం.. ఎప్పుడో పదిహేనేళ్ల క్రితంనాటి నా మేనకోడలి పెళ్లిలోకి నా ఆలోచనలను లాక్కెళ్లింది.

...

"రారా..హారీ, శాంతా బావున్నారా? యేమే భవ్యా! ఇప్పటికైనా గుర్తుకొచ్చామా?" అందరినీ ఒకేసారి పలకరిస్తూ ఆప్యాయంగా ఆహ్వానించింది అక్కయ్య.

మమ్మల్ని వీధి మొదట్లోనే చూసిన మేనల్లుడు దినేష్, మా బ్యాగులను బైకులో తెచ్చి అప్పటికే లోపల పెట్టేశాడు.

"అక్కయ్యా! అంతా బాగానే ఉన్నాం దుక్కల్లా. ఆఫీసు పని వల్ల ఎక్కడికీ రావడానికి ఇన్నాళ్లూ వీలుపడలేదు. ఇప్పుడొచ్చాం కదా, ఇప్పటికి కుదిరింది. మీరు మెడపట్టి గెంటినా ఇప్పట్లో వెళ్లొద్దని డిసైడ్ చేసుకుని వచ్చాం" బదులిస్తూ బయటే పెట్టిన

పెద్ద టబ్బులోంచి నాలుగు చెంబులు నీళ్లతో ముఖం కాళ్లూ, చేతులూ కడుక్కుని ఇంట్లోకి అడుగు పెట్టాను.

లోపలికి వెళ్లీ వెళ్లగానే పెద్ద షాక్ తగిలింది. ఆసరికే దిగిపోయిన మా పెద్దొదిన సోఫాలో బాసింపట్టు వేసుకొని కూర్చుని ఉంది.

"ఏమ్మరిదీ బావున్నారా?" అడిగింది రాణిసం ఉట్టిపడేలా. ఎప్పుడు ఎక్కడ బంధుమిత్రులిళ్లల్లో శుభకార్యాలు జరిగినా ఠంచనుగా హాజరైపోతుందీవిడ. అటూ యిటూ తిరుగుతూ ఏవేవో పనులు చేసేస్తూ తెగ హడావుడిగా కనిపిస్తుంది. అసలే భర్త మేనకోడలి పెళ్లి. పెళ్లికూతురు విరి అంటే తెగ ఇష్టం కూడా. ఇంకెంత హడావుడి చేయాలి... ఇప్పుడు అదేం కనిపించడంలేదు. ఇంకో సనాతన లక్షణముంది మా పెద్దొదినలో. మగ పురుషుడు ఎవరు ఎదురైనా సరే తెగ గౌరవించేస్తుంది. కొంగు నిండుగా కప్పేసుకుని వంగిపోయి మాట్లాడుతుంది. తనకంటే వయసులో చిన్నోళ్లే అయినా, వారు ఎదురుగా ఉన్నంతసేపూ నిలబడే ఉంటుంది. అటువంటి పెద్దొదిన చెట్టంత మరిదిని నేను ఎదురుగా ఉన్నా సరే కనీసం లేస్తున్నట్టు ఒక్క చిన్న కదలిక కూడా ఇవ్వకుండా, గుండ్రాయిలా కదలక మెదలక సోఫాను అంటిపెట్టుకుని కూర్చొనే ఉండడం షాక్ కాక మరేమిటి!

ఇంతలో చిన్నన్నయ్య చిదంబరం, చిన్నొ దిన కనకంవాళ్లు ఊడిపడ్డారు. కాస్త జరిగి చిన్నన్నయ్యకు పక్కనే చోటిచ్చాను. చిన్నొదిన మాత్రం వచ్చీ రాగానే ఉస్సూరంటూ సోఫాలో ఊర్చున్న నా కళ్ల ముందే చటుక్కున కింద కూలబడింది. కంగారుగా నా పాదాలను వెనక్కు లాక్కున్నాను.

"అరెరే అదేంటి కనకొదినా, కాళ్ల దగ్గర కూర్చున్నావు. లే, లేచి అక్కడ కుర్చీ ఉంది, వెళ్లి కూర్చో" చెప్పాను.

"ఇంత మంది మొగోళ్లు, పెద్దోళ్లు ఉండగా రాణుల్లాగా సోఫాలూ, కుర్చీల్లో కూర్చోవడం మన ఇంటా వంట లేదన్నయ్యా మరిదీ!" ఇంత మాత్రం నీకు తెలియదా అన్నట్లు. ఆమె ఎవరినైతే టార్గెట్ చేసిందో వారినే వెళ్లి తాకాయా మాటలు గురి తప్పకుండా.

అంతదాకా ఎవరితోనో పెళ్లి విషయాలు ముచ్చటిస్తున్నపెద్దొదిన చటుక్కున మాటలాపి ఇటు తిరిగింది.

"విన్నీ.. ఇలా రారా! అక్కడ డ్రెస్సింగ్ టేబుల్ మీద కాలి బ్యాండు పెట్టుండాను, ఇలా తెచ్చివ్వరా" గుమ్మానికి వెలుపల ఎవరితోనో మాట్లాడుతున్న కొడుకును పిలుస్తూనే–

"మర్యాదలు ఒకరు నేర్పిస్తే నేర్చుకొనే పరిస్థితిలో ఇక్కడెవరూ లేరు. కిందికి దొగిద్దని డాక్టరు చెప్పవట్టి కానీ.." దీర్ఘం తీసింది.

మా ఏడేళ్ల భవ్యను ఒడిలో కూర్చోబెట్టుకుని, వేరొక సోఫాలో పద్మాసనం వేసుకుని చిన్నపిల్లలా ఏదేదో గలగలా మాట్లాడేస్తున్న పెళ్లికూతురు విరిజ చివుక్కున పైకి లేచింది. వేలగాడి తూటా దెబ్బ తిన్న పక్షిలా విలవిల్లాడిన భావం ఆమె ముఖంలో. భవ్యను నడిపించుకుంటూ తన గదిలోకి వెళ్లిపోయింది.

"మామయ్యా!" అంటూ ఇంట్లోంచి షామియానా కింద ఉన్న నా దగ్గరికి వచ్చింది మేనకోడలు పెళ్లికూతురు విరిజ. దానికి నా దగ్గర చనువెక్కువ. చిన్నప్పుడు కొన్నేళ్లు మా ఇంట్లోనే ఉండి చదువుకుంది కూడా. చిన్నత్త, అదే నా భార్య అంటే ప్రాణం పెట్టేస్తుంది. ఇంతలో శాంత కూడా కూడా అక్కడికి వచ్చింది.

చిన్నొదిన మాటలకు ఆ అమ్మాయి కూడా చిన్నబుచ్చుకున్నట్లే ఉంది.

"ఓహో.. ఈమె కాలికేదో దెబ్బ తగిలింది కాబోలు" అనుకున్నాక పెద్దొదిన నన్ను చూసి కూడా సోఫాలోంచి లేవక పోవడమనే షాక్ నుంచి నాకు ఉపశమనం లభించింది. ఆడవాళ్ల మాటల్లో తల దూరిస్తే ఏమవుతుందో తెలిసిన అనుభవజ్ఞుడిని కాబట్టి, అక్కడి నుంచి మెల్లగా తప్పించుకుని బయట వేసిన షామియానా కిందికి వచ్చి కూర్చున్నాను. అప్పటికే అక్కడున్న అన్నలు, మామలు, పెదనాన్నలు, తమ్ముళ్లు, చెల్లెళ్లతో మాటల్లో పడ్డాను.

పెళ్లి ఇక మూడు రోజులే ఉంది. ఇప్పుడు దిగిపోయినవారంతా దగ్గరివారే. ఎవరూ కొత్తవారు లేరక్కడ.

ఇంతలో "మామయ్యా!" అంటూ ఇంట్లోంచి షామియానా కింద ఉన్న నా దగ్గరికి వచ్చింది మేనకోడలు పెళ్లికూతురు విరిజ. దానికి నా దగ్గర చనువెక్కువ. చిన్నప్పుడు కొన్నేళ్లు మా ఇంట్లోనే ఉండి చదువుకుంది కూడా. చిన్నత్త, అదే నా భార్య అంటే ప్రాణం పెట్టేస్తుంది. ఇంతలో శాంత కూడా కూడా అక్కడికి వచ్చింది.

ముగ్గురం ఆ పక్కనే గోడ కింద వేసిన వైరుమంచం మీద కూర్చుని మాటలు మొదలుపెట్టాం.

ఎక్కడినుంచో వచ్చి ఇంట్లోకి వెళ్లబోతున్న మా చిన్నత్త ఇద్దరు కూతుళ్లు "ఏం బావా! బాగున్నారా?" అంటూ నా వచ్చారు.

మంచమ్మీద కాస్త పక్కకు సర్దుకునే లోపే వంగని మోకాళ్లను పట్టుకుని ఆపసోపాలు పడుతూ కింద పోసిన ఇసుకలో కూర్చునేసి మంచంకోళ్లకు ఆనుకున్నారు. వాళ్లల్లో ఒకరికి ఈ మధ్యనే కాలికి చిన్న ఆపరేషన్ కూడా అయింది. కింద కూర్చోవాల్సి రావడంతో వాళ్లు పడుతున్న ఇబ్బంది నాకు స్పష్టంగా తెలుస్తూనే ఉంది.

"మంచం మీద ఖాళీ ఉంది, లేదంటే కుర్చీలు బోలెడున్నాయి. అంత కష్టపడుతూ కింద ఎందుకు, పైన కూర్చోవచ్చు కదా" అన్నానో లేదో..!

"అయ్యయ్యో! బావ ముందు ఆయనతో సమానంగా పైన కూర్చుని తైతక్కలాడడం మాకు చేతనవునా. మేం అంత అగౌరవంగా ప్రవర్తించడం నువ్వెప్పుడైనా చూశావా బావా?" ఏదో ఘోరమైన పాపం చెయ్యమన్నట్టు అనేశారు.

లెంపలేసుకోవడమే తక్కువ. వాళ్లు సిన్సియర్‌గానే అన్నట్టుంది.

వాళ్లలా చేయడంతో ఎవరూ లేరు కదా అని అంతదాకా నా పక్కనే ఉన్న మా ఆవిడ లేచి కింద కూర్చోక తప్పలేదు. ఈవిడ వెన్నునొప్పి, మోకాళ్ల నొప్పులు నాకు తెలిసి ఏం లాభం... అక్కడ పరిస్థితులు నా చేతుల్లో లేవు.

మనం ఏమైపోయినా సరే, ఎదుటి వారికి ఇవ్వాల్సి గౌరవాలు ఇచ్చి తీరాల్సిందే. లేదంటే సూటిపోటి మాటలు వినాల్సిందే. ప్రపంచంలోనే ఇంత అమర్యాదకరమైన మనుషులు లేరన్న బిరుదు మోయాల్సిందే.

ఆడవాళ్లు ఇటువంటి ఫంక్షన్లలో పనులు చేసుకునేటప్పుడు తప్ప, అందరి ముందూ రోజంతా నిలబడే ఉండాలి. మరీ శోష వచ్చి పడిపోయే పరిస్థితి ఉంటే తప్ప కిందైనా సరే ఎట్టి పరిస్థితుల్లో కూర్చోరాదన్నది మా కుటుంబాల్లో కనిపించే అప్రకటిత నిబంధన.

ఆ నిబంధనలు తెంచుకుని బయట పడడానికి ప్రయత్నించి అప్పుడప్పుడు మాత్రమే విజయం సాధిస్తుంటుంది నా మేనకోడలు విరి. చాలాసార్లు ఓడిపోతుంటుంది కూడా. ఇందాక ఇంట్లో జరిగిన ఎపిసోడ్‌లాగా విఫలమై గాయపడుతుంటుంది.

"నేను లోపలికి వెళ్తున్నాను మామయ్యా.. చిన్న పనుంది" ఇక ఇక్కడ తనుండదగ్గ వ్యక్తి కాదనుకుందేమో, అత్తయ్య వంక జాలిగా చూస్తూ ఇంట్లోకి తుర్రుమంది.. నేను స్పందించేలోగానే.

గంటల తరబడి నిలబడలేక, కింద కూర్చోలేక, అలాగని 'మర్యాదల'ను తోసిరాజని కుర్చీల పైకెక్కి 'తైతక్క'లాడలేక, ఆ రోజంతా శాంత పడ్డ వర్ణనాతీతం.

ఏ పనులు చేస్తున్నా, ఎవరితో మాట్లాడుతున్నా, ఈవిడ అవస్థ గమనిస్తూనే ఉంది పెళ్లికూతురు.

రాత్రి అన్ని పనులు పూర్తయ్యేసరికి పన్నెండు గంటలు దాటింది. అందరూ నిద్రకు ఉపక్రమిస్తున్నారు. పెళ్లికోసమే పక్కన ఇంకో ఇల్లు అద్దెకు తీసుకున్నారు అక్కయ్యావాళ్లు.

"శాంతా, వెళ్లి మనం ఆ పక్కింట్లో పడుకుందామా?" పిలిచాను. ఆమె మీద ప్రేమ ఎక్కువై కాదు. భార్య అనేది పక్కనుండే మెత్తటి పడక, దాహమైనప్పుడు చెంబులో నీళ్లందించడం, పొద్దున లేస్తూనే కాఫీ పట్టుకొచ్చివ్వడం, బ్రష్షు, దాని మీద పేస్టు వేసి దంత ధావనంతో పాటు స్నాన పానాదులు చేయించడం.. వంటి సకల సదుపాయాలూ సమకూరుస్తుంది కదా" అంటే–

"అత్తయ్య నాతో నా గదిలోనే పడుకుంటుంది మామయ్యా" పెళ్లికూతురు నా గొంతెమ్మ కోర్కెలకు అడ్డుకట్ట వేసింది.

అంతమందిలో మారు మాట్లాడలేక పోయాను. కాదని నాతోనే రమ్మని పట్టుబడితే–

"ఇంతమందిలో పెళ్లాంతో తైతక్కలాడా లనుకుంటున్నాడు, ఈయనకు ఇదేం పాడుబుద్ధి సిగ్గు లేకుండా" అని అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకుంటారేమో నని సైలెంటుగా వెలుపలికి వచ్చేశాను.

వెంట రాకుంటేనేం.. నా మేనల్లుడి ద్వారా తాను చేయగల సకల సదుపా యాలూ విడిదింట్లో కల్పించింది మా ఆవిడ.

ఉదయం స్నానపానాదులు అక్కడే ముగించుకుని, శాంత పంపిన కొత్త బట్టలు ధరించి, చక్కగా ముస్తాబై పెళ్లింటికి చేరుకున్నాను.



"శాంతా, శాంతా.." పిలుస్తూ లోపలికి వెళ్లిన నాకు దిమ్మ తిరిగే షాక్ తగిలింది.

ఓ మూలగా వేసిన ఒక కుర్చీలో నిమ్మ ళంగా కూర్చుని ఉంది మా ఆవిడ. ఇక్కడి మర్యాదలను తోసి రాజనేంత సాహసం ఈవిడకు ఎప్పుడొచ్చింది?

హఠాత్తుగా నన్ను చూడగానే తత్తరపడ్డ శాంత లేవబోయింది. అప్పుడే తన గదినుంచి హాల్లోకి వచ్చిన మేనకోడలు అది గమనించి కంగారుగా ఆవిడ భుజాలు పట్టి ఆపింది.

"అత్తయ్య లేవలేదు మామయ్యా, నా గదిలోని బాత్‌రూములో రాత్రి జారిపడింది. పెద్ద దెబ్బలేమీ తగల్లేదు కానీ పాదాలు బెణికి, మోకాళ్లు కూడా కొద్దిగా వాపు వచ్చాయి. తమ్ముడిని పంపి అయోడెక్స్ తెప్పించి రాశాను. కుడి కాలు మరీ నొప్పేస్తుంటే బ్యాండేజ్ వేశాను" చెప్పింది గుక్క తిప్పుకోకుండా.

"నిజమేనా?" అన్నట్టు చూశాను నా సతీమణి వైపు.

ఆవిడ చాలా ఇబ్బందిగా ఏదో తెలియని బాధ తో చూసింది నా వైపు.

"సరే జాగ్రత్త!" అంటూ బయటకు వచ్చేసాను.

అక్కడే పెడుతున్న టిఫిన్ లాగించి బంధుగణంతో పిచ్చాపాటిలో పడ్డాను. పెళ్లింట్లో ఉన్న మూడు నాలుగు రోజులూ కుర్చీ దిగలేదు నా భార్య.

అలా అనేదాని కంటే విరి ఆవిడను దిగనివ్వలేదు అంటే సరిగ్గా అతుకుతుంది మాట. మేనకోడలు అప్పగింతలదాకా ఉండి, ఇంటికొచ్చేశాం.

వచ్చినరోజే బ్యాండేజ్ విప్పి పడేసి, ఇంటిచాకిరీలోకి దిగిపోయింది మా శాంత.

పెళ్లిలో ఆవిడ 'కాలి' ఎపిసోడ్‌పై నాలో ఏదో అనుమానం తొలుస్తూనే ఉంది.

రెండు మూడు నెలలు గడిచిన తర్వాత విరి పుట్టింటికి వచ్చిందని తెలిస్తే– క్షేమ సమాచారాలు కనుక్కుందామని ఫోన్ చేశాను.

మా ఆవిడ లోకాభిరామాయణం మాట్లాడి వంటింట్లోకి వెళ్లాక అడిగేసాను ఉండబట్టలేక..

"నీ పెళ్లిలో మీ అత్తయ్య నిజంగానే జారిపడిందా? లేక ఆవిడ బాధ చూడలేక నువ్వు..."

"ఇప్పుడంతా ఎందుకులే మామయ్యా...సరే.. ఇంకేం విశేషాలు లేవు కదా, ఉంటా మరి" ముసి ముసిగా నవ్వుతూ ఫోన్ కట్ చేసింది.

అర్థమైంది నాకు. అప్పుడే కాదు, ఇప్పటివరకూ మా ఆవిడ వద్ద ఆ ఎపిసోడ్ తీసుకురాలేదు నేను.

................

"ఏమండీ!" శాంతి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాను. సతీమణిని సోఫాలో యథాప్రకారం పడుకోబెట్టాను.

వచ్చి కుర్చీలో కూర్చుని పేపరు చేతిలోకి తీసుకోబోతూ– "అల్లుడు చెబుతున్నాడు కదా. ఈ నొప్పులు లేనంత కాలం అన్నీ నువ్వే చేశావా లేదా. మర్యాదలంటూ హడావుడి చేసి, మళ్లీ నువ్వు ఎక్కడైనా జారి పడితే మందు రాసి, బ్యాండేజ్ వేసేందుకు ఇక్కడ నా మేనకోడలు కూడా లేదు" పెదవులు దాటనివ్వని నవ్వుతో చెప్పాను కొంటెగా.. ముసలోళ్ల మైపోయాక ఏం చేస్తుందిలే అన్న ధైర్యం.

"అయితే అన్నీ తెలుసన్నమాట! వద్దు.. బాగుండదని ఎంత చెప్పినా అది వినలేదండీ! లేని గాయానికి బ్యాండేజి కట్టి కుర్చీలో కూచోబెట్టేవరకూ పోరు పెట్టింది. అయినా అప్పుడు అదలా చేసి ఉండకపోతే నాకున్న కీళ్లనొప్పులకు నెలా రెండు నెలలదాకా పడకలో పడి ఉండడం తప్పేది కాదు....కోడలిని తలచుకుంటూ అభిమానంగా అంది.

"మరిప్పుడు అల్లుడుగారికి మర్యాదలు చేయలేకపోవడం.. ఈ నొప్పులు కూడా ఉత్తుత్తివేనా?"

తనకే సాధ్యమైన రీతిలో గమ్మత్తుగా మూతి ముడిచింది శాంత.

ఆవిడ పక్కనే జండూబామ్ డబ్బా సరసంగా వచ్చి నా ఛాతీని సుతారంగా తాకి ముద్దెట్టుకుంది. ◆

# కాళ్ళకూరి వారి ముగ్ధమనోహర నాయిక 'చింతామణి'

తెలుగు నాటక రంగంలో మహా కవి గురజాడవారి సృష్టి 'కన్యాశుల్కం', మరొక మహాకవి కాళ్ళకూరి నారాయణరావు 'చింతామణి', 'వర విక్రయం', 'మధుసేవ' వంటి నాటకాలు సామాజిక సంస్కరణలలో భాగంగా సామాజిక దురాచారాలను ఖండిస్తూ, జనజీవన శ్రేయస్సు లక్ష్యంగా కీర్తిబావుటా ఎగురవేసాయి. నాటి సనాతన సంప్రదాయంలో వేశ్యా, వరకట్నం, మద్యపానం, బాల్య వివాహాలు వంటి దురాచారాలు కుటుంబాలలోని మహిళల జీవితాలలో చిచ్చు పెట్టి తీరని వేదన, జీవన సంక్షోభం కలిగించేవి.




తెలుగు సాహిత్యం, మూడు పువ్వులు ఆరు కాయలుగా వివిధ ప్రక్రియలతో విలసిల్లుతున్న రోజులలో, సామాన్య, మధ్య తరగతి జన జీవనంలో పురుషాధిక్య,, అహంకార ధోరణులు ప్రబలి, యువకులు వ్యసనాల పాల్పడి కుటుంబాలు దారిద్ర్యం, అవిద్యతో సంసార జీవనాలు అస్తవ్యస్తం అవుతున్న రోజులవి. 1871లో జన్మించిన, కాళ్ళకూరి నారాయణరావు రామాయణ, భాగవతములు, కావ్య నాటకాలంకార గ్రంథాలు, ఆంగ్ల సాహిత్యం కూడా అధ్యయనం చేసారు. నాటక రచయితగానే కాకుండా కవి, అవధానిగా, కథా నవలా రచయితగా, పాత్రికేయునిగా, ఉపాధ్యాయునిగా, దేశభక్తునిగా, సంఘ సంస్కర్తగా, జాతీయవాది కాళ్ళకూరి బహుముఖ ప్రజ్ఞాశాలిగా ప్రసిద్ధులయ్యారు. ఫొటోగ్రాఫర్‌గా, పట్టా లేని వకీలుగా, ఆంధ్రాధ్యాపకునిగా హస్త సాముద్రికం, భూతవైద్యం, మంత్రోపాసన, యోగవిద్య, వ్యాయామంలో పరిచయం సాధించారు. సమకాలికులు ఆదిభట్ల నారాయణదాసు, కోడిరామమూర్తి, కందుకూరి వీరేశలింగం వంటి ప్రముఖులతో సాన్నిహిత్యం వుండేది. చిత్రాభ్యుదయం, పద్మవ్యూహం, చింతామణి, వరవిక్రయం, మధుసేవ, సంసార నటన వంటి చారిత్రక, పౌరాణిక, సాంఘిక నాటకాలు రచించారు. ప్రతాపరుద్రమదేవి చారిత్రక నవల, విమర్శలు, వ్యాసాలు, కథలతో తెలుగు సాహిత్య రంగాన్ని సుసంపన్నం చేసారు.

'చింతామణి' నాటకం 1921లో అచ్చు అయింది. "భగవంతుడు దీనినింకను వ్యాపకములోనికి తెచ్చి పాపభూయిష్ట మగు వ్యభిచార వృత్తిని పూర్తిగా నిర్మూలించుగాక" అని రచయితే స్వయంగా చెప్పుకొన్నారు.

ఈ నాటక ప్రభావం వలన వేశ్యలు వృత్తి మానుకున్నారు. విటులు ఆ మార్గం విసర్జించిన, ప్రభావం కూడా స్పష్టమైంది. వేశ్యా సమస్య మీద 'చింతామణి' వరకట్న దురాచారం మీద 'వర విక్రయం', మద్యపాన వ్యసనంపై 'మధుసేవ' సమాజాన్ని ప్రభావితం చేసాయి. వ్యభిచారం ఒక వృత్తిగా, 'చింతామణి', సాంఘిక దురాచారాన్ని నిర్మూలించే లక్ష్య సాధనతో నాటకం నడిచినా, కాలగమనంలో శృంగార, హాస్య ప్రధాన ఇతివృత్తంగా రూపం మారిపోయింది. అశ్లీల ప్రధానాంశంగా నాటక సమాజాలు, సంభాషణలు సృష్టించి సాంకర్యం పాల్పేసాయి. అందులో సుబ్బిశెట్టి పాత్ర, చింతామణి తల్లి లేదా వేశ్యమాత శ్రీహరి పాత్రలలో అశ్లీల సంభాషణలు జొప్పించి, ప్రేక్షకులను ఆకర్షించడానికి జిమ్మిక్కులు కొనసాగాయి.

చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి వంటి పాత్రలు రచయిత నిజ జీవితంలో ఎదురైన వ్యక్తుల ఆధారంగా సృష్టించినవే. కథానుగుణంగా నాటకాన్ని నడిపించడం తప్ప అందులో కుల ప్రస్తావన లేదు. కులాన్ని కించపరిచే అవకాశం లేదు. అయినా ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హఠాత్తుగా ఈ నాటకాన్ని నిషేధిస్తున్నట్టు ఉత్తర్వు జారీ చేసింది. ఇంచుమించు ఒక శతాబ్దంనాటి ఆ సాంఘిక నాటకం యిప్పుడు నిషేధానికి గురి కావటం, అదీ కులాన్ని అవమానిస్తోందడం వింతైన సామాజిక పరిణామం.

తెలుగు నాటక రంగంలో పద్యాలకు పట్టాభిషేకం చేసిన నాటకాలు ఎన్నో ఉన్నాయి. రాగ, భావ యుక్తంగా నాటకాలలో పద్యాలు, సాహితీ విలువలు, పద సంపదతో జన సామాన్యాన్ని ఆకట్టుకొని, నాటకానికి విశేష కీర్తి ప్రాచుర్యం తెచ్చిపెట్టాయి. 'చింతామణి' అటువంటిదే.

పశ్చిమ గోదావరి జిల్లా మత్స్యపురి నివాసి అయిన కాళ్ళకూరి నిజ జీవితంలో కూడా సంఘ సంస్కరణాభిలాషిగా, వివాహం చేసుకొన్నారు. కవులు మహా పండితులు, కొప్పరపు సోదరుల అవధాన ప్రతిభకు ప్రభావితులై, ఆ కవుల సమక్షంలో అవధాన శిరోమణిగా సన్మానం పొందారు. 'చిత్రాభ్యుదయం' రచయితగా పుష్పగిరి పీఠాధిపతులు మహాకవి బిరుదు ప్రదానం చేసారు. కాకినాడలో అఖిల భారత కాంగ్రెస్ సమావేశమైనప్పుడు 'కాంగ్రెస్ కట్నం' అనే పుస్తకంలో విశేష రాజకీయ సంచలనం సృష్టించారు. పద్యాలు మధురంగా గానం చేసి నాటకాలలో శ్రోతలను అలరించేవారు.

1927లో స్వర్గస్థులైన కాళ్ళకూరి నారాయణరావు జీవితంలో ఆద్యంతం సామాజిక చైతన్యశీలిగా సాహసికంగా గడిచింది. కాకినాడ నుంచి ఆ రోజులలో వెలువడిన 'మనోరంజని' సాహిత్య మాసపత్రికకు సంపాదక బాధ్యత నిర్వర్తించారు.

తండ్రి అడుగుజాడలలో కుటుంబం సంగీత, సాహిత్య నట సరస్వతిని ఆరాధించింది. 'కాళ్ళకూరి' వారి కుమార్తె 'కాంచనమాల' అందాల సినీ నటిగా నాటి తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాలను పరవశింపచేసింది. ఆమె కుమారుడు వై.వి.రావు చిత్ర నిర్మాతగా ప్రఖ్యాతి పొందారు. కాళ్ళకూరి వారి మరొక కుమారుడు సదాశివరావు సినీ దర్శకునిగా విశేష ఖ్యాతి సాధించారు.

– జయసూర్య




**లే**నిది వున్నట్టు
ఉన్నది లేనట్టు
ఉపన్యాసాలు పొర్లుతున్నాయి
ఎన్నాళ్లీ కాగితంపూలు
లేనిది లేనట్టుగా ప్రత్యక్షమైతే
ఉండాల్సింది పుట్టుకొస్తుంది
వచ్చింది అస్తిత్వం చాటుతుంది!
రాత్రి నిద్రపోవటం లేదు
పగలై కూర్చుంది
గుండె భయభ్రాంతమైంది
పగలు నిద్ర పోతుంది
రాత్రై నిల్చింది
మది స్వస్థతై కూర్చుంది
గుండెది ద్విపాత్రాభినయం.
చంద్రుడికి స్థానభ్రంశమైంది
సూర్యుడు ఆక్రమించాడు.
సూర్యుడి స్థానం చంద్రుడిదైంది
ఋతువులు నివాసాలు మారి
అధినేతల కొలువుల్లో
ప్రవాసమయ్యాయి
నేను చెప్పిందే వేదం
అంటున్నాడు మనిషి
వేదాలు బ్రహ్మకు మొరపెట్టాయి
ఆలోచనలో పడి
అచేతనుడైన
తండ్రి బ్రహ్మ ఎదుట
తనయుడు నారదుడు
దీర్ఘ తపస్సు చేస్తున్నాడు!
ముక్కోటి దేవతలు
అత్యవసర సమావేశమై
ఒకానొక తీర్మానానికి
ఏకమయ్యాక
గాలిని బంధించిన మానవుడు
ఊపిరాడనీయక
ఉక్కిరి బిక్కిరి చేశాడు!
సముద్రపు వొడ్డున
నిల్చున్న మనిషిని
వేగంగా దూసుకొచ్చిన అల
హఠాత్తుగా లోపలకు లాగింది
బలంగా నిలదొక్కుకున్న మనిషి
ఒక్కసారి గట్టిగా కాలు జాడించాడు
ఓడిపోయిన అల
వెల్లకిల్లా పడిపోయింది.

**- అడిగోపుల వెంకటరత్నమ్**

---

## ఇదో నిరీక్షణ

**తె**లియకుండానే కాలం
కాటేసి పోతుంది
మనసును చదవకుండానే
చివరి ఉత్తరం రాసేసి పోతుంది
ఈ ఆశ నిరాశల రేఖాచిత్రాల్ని
ఎంత చిత్రంగా గీస్తూ పోతుందో
ఏ సుఖమో వరించేది
ఏ కాలమో ఇన్ని నీడల్ని పరచేది
వొక్క సుఖాంతం రెక్క విప్పుకొనేలోగా
ఎన్ని విషాద పవనాల వీచికలు!
నిలువెత్తు చల్లని నీడలో
పేలిపోతున్న కలల దీశ్యాలు
ఈ ఆకాల కాల పరిణామంలో
తెరచాప లేని ప్రయాణమొకటి
ఏ నీడ లేని వాకిలికో
నిలువలేని ఏ అరణ్యాలకో
ఈ కలల కలవరింతల్లో తెలియని
సూర్యోదయాల నిరీక్షణ
ముగిసేది ఏనాటికో!
కొత్త పల్లవి మొదలయ్యేది ఏ వేళకో!

**- రవి మాగంటి**

**ఒక** శిఖరం అంబరాన్ని తాకింది
నల్లని మేఘాలకు స్నేహ హస్తం అందించింది!
మేఘం కరిగి దయామృత వర్షంతో
బీటలు వారిన చేల దాహార్తి తీర్చింది!




నీరోసుకున్న భూమాత మొలకలను, మొక్కలను
పెంచి పోషించి సస్యశ్యామలమై అలరారింది!
ధాన్యపురాశుల గాదెల నింపి / ప్రాణికోటి ఆకలి బాపింది!
శిఖరం పాషాణమైనా, ప్రాణముంది
ద్రవించే గుణముంది.. దాగివున్న రూపముంది!
నింగినే కాదు.. నేలను చూసే మనసుంది
తన పుట్టుక పుడమియే గనుక!

**- ఏవివి ప్రసాద్ శర్మ**

# తులసికోట ఏ దిక్కులో ఉండాలి?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్: 9885446501/9885449458




తులసి హిందువులకు గోమాతలా అతి పవిత్రమైంది, పూజనీయమైంది. తులసి ఆకులు ఎన్నో మందుల్లో ఉపయోగించబడతాయి. ఎన్నో రోగాలకు దివ్యమైన ఔషధంగా ఉపయోగపడుతుంది తులసి.

చెట్లు రోజంతా బొగ్గుపులుసు వాయువును గ్రహించి ప్రాణ వాయువును విడుదల చేస్తాయి. రాత్రుళ్ల ప్రాణవాయువును గ్రహించి బొగ్గుపులుసు వాయువును విడుదల చేస్తాయి. రాత్రుళ్ల భారీగా బొగ్గుపులుసు వాయువుని విడుదల చేసే వృక్షాల్లో చింతచెట్టు ఒకటి. ఇలాంటి చెట్ల కింద రాత్రుళ్ల పడుకుంటే అది విడుదల చేసే బొగ్గుపులుసు వాయువు ఎక్కువగా కలిసి వున్న వాయువును మనం శ్వాసించవలసి వస్తుంది. తద్వారా మెదడుపై ప్రభావం పడి చెడు కలలు రావడం, నిద్రలో దడుసుకోవడం జరుగుతుంది. అందుకే రాత్రిపూట చింతచెట్టు కింద పడుకోవద్దు అని చెప్తుంటారు పెద్దలు.

తులసిచెట్లు రాత్రి, పొద్దూ ప్రాణ వాయువునే వెదజల్లుతాయి. మనిషి ఆరోగ్యానికి చేయూతనిచ్చే ఇలాంటి మొక్కలు ఇంటి ఆవరణలో వుండటం చాలా మంచిది. సైంటిఫిక్‌గా ఈ కారణాలు చెప్పకుండా ప్రతి ఇంట్లో తులసి మొక్క వుండాలని "తులసి లేని ఇల్లు గుల్ల చేయును ఒళ్లు" లాంటి సామెతలను జనాల్లోకి జొప్పించారు పెద్దవాళ్లు. ఎలా చెప్పినా ప్రతి ఇంట్లో కనీసం ఒక తులసి మొక్కను పెంచటం శ్రేయస్కరం.

మొక్కల మీద రీసెర్చ్ చేసి- వాటికి ప్రాణముందని, స్పందన వుందని నిరూపించిన భారతీయ వృక్ష శాస్త్రజ్ఞుడు జగదీశ్ చంద్రబోస్ పేరు స్మరించుకోవడం అసందర్భమేమీ కాదు. చెట్టులో ఒక భాగానికి నిప్పుతో చురక అంటిస్తే అదే చెట్టులోని మిగతా భాగాలు స్పందించి ముడుచుకుపోవడం అతడు చేసిన ప్రయోగాల్లో ఒకటి. ఎండవేడి ఎక్కువ లేనప్పుడు చిరుగాలికి ఆహ్లాదంగా కదిలే పూలమొక్కల స్పందన తెలిసిందే.

మొదటిసారి మొగ్గ వేసిన పూల మొక్కను క్షణం పరిశీలనగా చూస్తే ఆ మొక్క ఏదో సాధించిన పసివాడిలా మురిసిపోవడం కనిపిస్తుంది. అయితే అవన్నీ చూసే తీరికలేక వాటి ప్రకంపనాలు అధ్యయనం చేసే మహద్భాగ్యాన్ని మనం పోగొట్టుకున్నాం.

తులసి నుండి వచ్చే ప్రాణవాయువు ఇంటి ఆవరణలోని గాలిలోని కాలుష్యాన్ని తగ్గించటానికి తోడ్పడుతుంది. కలుషితం తక్కువ వుండే వాయువులను శ్వాసించడం వల్ల మెదడుపైన కాలుష్య ప్రభావం తక్కువగా పడుతుంది. తద్వారా ఆలోచనా సరళి ఎక్కువ ఆరోగ్యంగా ఉంటుంది.

'డెసిషన్ మేకింగ్' అంటే తమ తమ సమస్యల మీద తీసుకొనే నిర్ణ యాలు ప్రగతి పథం వైపు నడిపించేవిగా వుంటాయి. పెద్ద పెద్ద కాన్ఫరెన్సు హాల్లో ఎగ్జిక్యూటివ్‌లు కూర్చుని సంస్థలను నడిపించే గదుల్లో తులసిమొక్కలు లేకపోయినా పూలమొక్కలు వుండటానికి ఇదొక శాస్త్రీయ కారణం. ఆహ్లాదంగా ఎదురుగా కుండీల్లో పూలమొక్కలు కనిపిస్తుంటే అందంగా కనిపించటమే కాకుండా అవి విడుదల చేసే ఆక్సిజన్ వలన టెన్షన్ తగ్గి మనసు నెమ్మది పొందుతుందనడంలో అతిశయోక్తి లేదు.

తులసి ప్రకంపనాలు ఇంట్లో వ్యక్తుల మీద చక్కటి ప్రభావాన్ని చూపిస్తాయి. ప్రయత్నం చేస్తే ఇంట్లో పిల్లలతో, తల్లితో మాట్లాడినట్లు తులసితో సంభాషించవచ్చు.. అంటే ఆశ్చర్యం కలుగుతుంది.



**తన్మూలే సర్వతీర్థానీ**
**తన్మధ్యే సర్వ దేవతా ।**
**తదగ్రే సర్వ వేదశ్చ**
**తులసీ త్వాం నమామ్యహం ॥**

అనే శ్లోకాన్ని పఠిస్తూ తులసికి ప్రతి ఉదయం నీళ్ల పోసి నమస్కరించాలి. పవిత్రమైన స్థలాన్ని శుచిగా శుభ్రంగా వుంచితే మంచి ఫలితాలు వచ్చినట్లే అపరిశుభ్రంగా వుంచితే చెడు ఫలితాలు వస్తాయి. అలాగే తులసి విషయంలోనూ జరుగుతుంది.

ప్రతిరోజూ ఓ చెంబు నీళ్ల పోసి నమస్కరిస్తే చాలు.. కానీ అపరిశుభ్రంగా వున్నవాళ్లు అటూ ఇటూ నడుస్తున్నప్పుడు తులసిని తాకటం జరిగితే తులసి ఆగ్రహిస్తుంది. కనుక ఈ చిన్న విషయంలో కాస్త జాగ్రత్త పడాలి.

తులసిని ఇంటి ఆవరణలో ఎక్కడ పెట్టటానికి అనువైన స్థలం వుందో ముందు నిర్ణయించుకోవాలి. అంటే దారిలో కాకుండా వుండేలా చూసుకోవాలి.

నిర్ణయించుకున్న స్థలం 'ఉత్తరం' అయితే అక్కడ 'తులసికోట'ను ఏర్పాటు చేయకూడదు. ఉత్తరపు 'పల్లం'లో తులసిని కుండీలో అమర్చుకోవడం ఉత్తమం.

దక్షిణ భాగాన తులసికోటను నిర్మించుకోవడం మంచిది. దక్షిణాన ఎత్తయిన భాగంలో తులసికోట నిర్మాణం మరీ మంచిది.

అలాగే 'నైరుతి'లో కూడా ఎత్తయిన భాగంలో తులసికోట శుభప్రదమైంది

పడమరలో కూడా ఉన్నత స్థానంలో తులసికోట శ్రేష్ఠమైంది.

ఈశాన్య భాగంలో తులసికోట మంచి ఫలితాలనివ్వదు. ఈశాన్య పల్లంలో కుండీలో పెట్టుకోవచ్చు. కానీ దక్షిణ, నైరుతి, పడమర ఉన్నత స్థానాల్లోనే మంచి ఫలితాలు కలగడం గమనించవచ్చు.

తూర్పు ముఖ ద్వార గృహంలో తూర్పు ఆగ్నేయంలో కోట నిర్మించాలి. తులసిచెట్టు స్థానాలు కలిగించే మంచీ చెడు ఫలితాలు ఎక్కువగా స్త్రీల మీద మాత్రమే చూపిస్తాయనే నమ్మకం ఉంది. అది సరైంది కాదు. ఇంట్లో వున్న అందరి మీద ఫలితాలు ఉంటాయి.

రస్కిన్ బాండ్ భారతదేశంలోని ప్రముఖ రచయితలలో ఒకరు. ఆయన పిల్లల కోసం చాలా పుస్తకాలు రాశారు. 1992లో Our trees still grow in Tehra అనే పుస్తకానికి సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు.

రస్కిన్ బాండ్ హిమాచల్‌ప్రదేశ్‌లోని కసోలిలో జన్మించారు. ఆయన తండ్రి, ఆబ్రీ అలెగ్జాండర్ బాండ్, రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ వైమానిక దళంలో పని చేసారు. రస్కిన్ బాండ్ గుజరాత్‌లోని జామ్‌నగర్, డెహ్రాడూన్,

రంగు గొడుగుని తీసుకోవాలనుకుంటాడు. కానీ ఆ అమ్మాయి గొడుగుని ఇవ్వదు.

దాంతో కోపోద్రిక్తుడైన నందకిషోర్ ఆ గొడుగుని ఎలాగో దొంగిలించి దాచేసుకుంటాడు. అయితే అక్కడా ఇక్కడా వెతికి ఎక్కడా గొడుకు ఆచూకీ కనిపించకపోయే సరికి ఆ అమ్మాయికి నందకిషోర్ మీద అనుమానం వస్తుంది. అతనే ఆ గొడుగుని తీసుకునుంటాడని ఆ అమ్మాయి అభిప్రాయం. కానీ అందుకు ఆమె దగ్గర ఎలాంటి ఆధారాలు లేవు.

నందకిషోర్ తస్కరించిన ఆ గొడుగుని




అత్తలు.. వారు భయంకరమైన జంతువులు. నేను వారికి దూరంగా ఉంటానని"

# పిల్లల కథలే రస్కిన్‌బాండ్ లోకం

సిమ్లాలలో పెరిగారు. పిల్లల కోసం ముప్పై పుస్తకాలు రాశారు.



అతను తన ఆత్మకథను రెండు భాగాలుగా రాసి ప్రచురించారు. 1999లో భారత ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది.

ఆయన కథ 'నీలిరంగు గొడుగు' విశాల్ భరద్వాజ్ దర్శకత్వంలో సినిమాగా రూపొందింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని ఓ కుగ్రామంలో నివసించే ఫినియా అనే అమ్మాయి ఒకరోజు తన గ్రామంలోని ప్రకృతి అందాలను చూసేందుకు విదేశీ పర్యాటకులు తన గ్రామానికి రావడం చూస్తుంది. ఆ ప్రయాణికులలో ఒకరి దగ్గర అందమైన నీలిరంగు గొడుగు ఉంది. ఆమె తన వద్ద ఉన్న పులిగోటిని అతనికిచ్చి ఆ నీలి రంగు గొడుగును పుచ్చుకుంటుంది.

ఆ గొడుగుని అందరికీ చూపిస్తూ ఆ అమ్మాయి చాలా ఆనందపడుతుంది. ఆమె పట్టరాని ఆనందంతో నాట్యం చేస్తుంది.

ఆ ఊళ్లో నందకిషోర్ అనే అతనికి ఓ చిన్న బడ్డీ కొట్టు ఉంది. అతని గుణం సరైంది కాదు. అతను ఏవేవో మాయ మాటలు చెప్పి అమ్మాయి దగ్గరున్న నీలి

ఆమె తిరిగి ఎలా పొందిందనేది చిత్ర కథాంశం.

రస్కిన్ బాండ్ స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లోనే ఆంగ్లంలో సరళమైన పదాలతో కవితలు రాసిన వ్యక్తి అలాగే భావోద్వేగమైన కథలు కూడా రాశారు. ఆయన రచనలను పిల్లలు తప్పక చదవాలి. నేను ఒకానొకప్పుడు రస్కిన్ బాండ్ రాసిన ఒక చిన్న కథ(లేని కళ్లు)ను చదివాను. ఇది ఓ రైలు ప్రయాణానికి సంబంధించిన కథ. రోహానా వెళ్లే రైల్లో ఓ యువతి ప్రయాణం చేస్తోంది. ఆమెను రైలెక్కించిన తల్లిదండ్రులు క్షేమంగా వెళ్లిరమ్మని సాగనంపుతారు.

ఆ రైల్లో ఓ అంధ యువకుడు కూడా ప్రయాణిస్తున్నాడు. ఆయన కోణంలోంచి కథ సాగుతుంది. తనకెదురుగా ఒక అందమైన యువతి కూర్చుందని ఆ యువకుడు గ్రహిస్తాడు. ఏ ఊరికి వెళ్తున్నావని ఆమెను అడుగుతాడు.

సహరాన్‌పూరు వెళ్తున్నానని, స్టేషన్‌కి అత్తయ్య వచ్చి తనను ఇంటికి తీసుకుపోతుందని చెప్తుంది ఆ యువతి.

అయితే అతను "ఈ అత్తలున్నారే

చమత్కరిస్తాడు యువకుడు.

"మీరెక్కడికి వెళ్తున్నారని" అడుగుతుంది ఆ యువతి అతనిని.

"డెహ్రాడూన్" అంటాడతను.

"రైలు వేగంగా పోతోంది. ఆ యువతి కిటికీలోంచి బయటి దృశ్యాలు చూస్తున్నట్లు గ్రహిస్తాడు. "చెట్లు పరుగులు తీస్తున్నాయి. మనం స్థిరంగా ఉన్నామంటా"డతను.

"అవును.. అలానే అన్పిస్తుంది" అని సమాధానం చెప్తుంది.

"తాను అంధుడినని ఆమె గ్రహించి ఉంటుందా?" అని అతను ఆలోచనలో పడతాడు. ఆశ్చర్యపోతున్నాడు. ఆమెతో మాట్లాడాలని ఆశ పుడుతుంది అతనికి.

"మీ ముఖాన్ని చూడాలన్పిస్తోంది" అంటాడతను.

ఆ మాటతో ఆమె కాస్త సిగ్గు పడి చిన్న నవ్వు నవ్వుతుంది. వారి మధ్య ఆ తర్వాత పెద్దగా మాటలు కొనసాగలేదు. కానీ ఆమెకు ఎదురుగా ఉండటం, ఆమె తనలో కల్పించిన పారవశ్యం అతన్ని తీవ్రంగా ఆలోచింపచేస్తుంది.

ఆమె తదుపరి రైల్వే స్టేషన్‌లో దిగిపోతుంది.

రైలు బయలుదేరుతున్నప్పుడు ఆమె వెళ్లొస్తానని చెప్పి వెళ్లిపోతుంది. పువ్వు విసిరేసిన తర్వాత కూడా పువ్వు పరిమళం ఇంకా ఉన్నట్టే ఎలా అనిపిస్తుందో అలాగే ఆమె జ్ఞాపకమూ అతని హృదయాన్ని ఆక్రమిస్తుంది.

ఇతర ప్రయాణికులు తోసుకుంటూ

రైలెక్కారు. రైలు బయలుదేరుతుంది.

ఒక కొత్త ప్రయాణికుడు వచ్చి అతని పక్కన కూర్చుంటాడు. "నేను ఆ అమ్మాయిలా ఆకర్షణీయంగా ఉండను లెండి" అంటాడు.

అంధ వ్యక్తి తన ఎదుట కూర్చున్న ప్రయాణికుడితో మాట్లాడుతూ "ఆమె జడ ఎలా ఉంది, పొట్టి జడా లేక పొడుగు జడా?" అని అడుగుతాడు.

"తాను గమనించలేదంటూ ఆమె కళ్లను మాత్రమే చూశానంటాడు" ఎదుటి వ్యక్తి.

"ఎంత అందమైన అమ్మాయో! కానీ ఆమె అంధురాలు" మీరు గమనించ లేదా?" అనడంతో కథ ముగుస్తుంది.

ఆ యువతీ, యువకులు ఇద్దరూ అంధులే. వారి మధ్య జరిగిన ఓ అందమైన కలయిక అది. కానీ వారిరువురిలో ఒకరికొకరికి కంటిచూపు లేదన్న నిజం తెలియదు. వారిద్దరి మధ్య జరిగే కలయికను రష్కిన్ బాండ్ ఈ కథలో ఎంతో అందంగా చిత్రీకరించారు.

ఈ కథ చదువుతుంటే నాకు రేమండ్ కార్వర్ కెథడ్రల్ అనే చిన్న కథ గుర్తుకు వచ్చింది. అది తన భార్య స్నేహితుడైన అంధుడికి సంబంధించినది. రస్కిన్ బాండ్ కథ నలభై సంవత్సరాల క్రితం ప్రచురితమైంది. నాలుగు పేజీల చిన్న కథ. చిన్న కథలు రాయాలనుకునే వారికి ఈ కథ ఒక ఆలోచనను రేకెత్తిస్తుంది. అంధ పాత్రను పరిచయం చేస్తున్న వ్యక్తి తన ఎదుట ఉన్న వ్యక్తి కూడా చూపు లేనివాడనే ఆలోచన రానే రాదు. కానీ రస్కిన్ బాండ్ నడిపించిన ఈ చిన్న కథ అమోఘం. తన కథ ద్వారా పాఠకుడితో ఊహాత్మక ప్రయాణాన్ని చేయిస్తారు రచయిత. ఆయన చిన్న


రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.

**రచనలకు ఆహ్వానం**

రచనలు పంపించాల్సిన చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్,
డిబిఆర్ మిల్స్ పక్కన,
హైదరాబాద్-80. sunmag-vaartha@gmail.com





కథల రచనాశైలి ఎంతగానో ప్రసిద్ధి చెందాయి.

రస్కిన్ బాండ్‌కి కథలు రాయడమన్నా, చెప్పడమన్నా మహా ఇష్టం. అరవై ఏళ్లకు పైగా రచయితగా కొనసాగిన బాండ్‌ని ఇండియన్



విలియం వర్డ్స్ వర్త్ అని పిలుస్తారు. ఎందుకంటే ఆయన రచనలన్నీ ఓ అద్భుత సృష్టి. చిన్నతనంలో డ్యాన్సర్ అవాలని అనుకుంటాడు. అతని నాలుగో ఏట తల్లిదండ్రులు విడిపోతారు. అనంతరం ఆమె ఓ భారతీయుడిని వివాహం చేసుకుంటుంది.

రస్కిన్ బాండ్‌కి తన తండ్రికి అత్యంత సన్నిహితుడిగా ఉంటాడు. కానీ దురదృష్టవశాత్తు ఆయన తండ్రి కోల్‌కతాలో ఉద్యోగం చేస్తున్నప్పుడు మలేరియా బారిన పడ్డారు.

బోర్డింగ్ స్కూల్లో చదువుకుంటున్న రోజుల్లో బాండ్‌కి తన తండ్రి చనిపోయిన విషయం ఓ ఉపాధ్యాయుడి ద్వారా తెలుస్తుంది. అప్పుడు అతని వయస్సు పది సంవత్సరాలు.

అనంతరం కొంత కాలం ఇంగ్లండులో ఉన్న రస్కిన్ బాండ్ భారతదేశానికి వచ్చి స్థిరపడతారు. రచయితగా ఉండాలనుకుంటాడు.

ఆయన రాసిన మొదటి నవల 'ది రూమ్ ఆన్ ది రూఫ్'. ఇది కొంతమేరకు ఆయన ఆత్మకథ లాంటిది. 1956లో ఆయన మొదటి పుస్తకం 'ది రూమ్ ఆన్ ది రూఫ్' ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ పత్రికలో ధారావాహికంగా ప్రచురింపబడింది. దీనికి దిగ్గజ కార్టూనిస్ట్ మరియో మిరాండా బొమ్మలు గీశారు.

ఢిల్లీలో తన ఉద్యోగాన్ని వదులుకుని, డెహ్రాడూన్‌లో రచయితగా స్థిరపడాలని నిర్ణయించుకున్నప్పుడు ఆయన వయస్సు ముప్పై సంవత్సరాలు. ఆయన 1993లో సాహిత్య అకాడమీ అవార్డు, 1999లో పద్మశ్రీ, 2014లో పద్మభూషణ్ అవార్డులు అందుకున్నారు. ఆయన అప్పుడప్పుడు ముస్సోరిలోని పుస్తక దుకాణాల్లో తన పాఠకులతో మాట్లాడుతూ కనిపించేవారు. ఆయన అయిదు వందలకు పైగా చిన్న కథలు రాశారు. అలాగే వ్యాసాలు, నవలలు, పిల్లల కోసం యాభైకి పైగా పుస్తకాలు, ఆత్మకథ(రెండు సంపుటాలు) రాశారు. ఆయన బాల్యంలో చదివిన మొదటి పుస్తకం Alice in Wonder land:And Other Tall Tale.

తాను చాలా బద్ధకస్తుడినని, వర్షం పడితే చిరాకుగా ఉంటానని చెప్పుకున్న రస్కిన్‌బాండ్ మీడియా దృష్టికి దూరంగా ఉండేవారు. ఆయన పెళ్లి చేసుకోలేదు. రస్కిన్ బాండ్ ఫొటో స్టూడియోలో పని చేయడం ద్వారా తన వృత్తిని ప్రారంభించారు. రస్కిన్ బాండ్ తెగ పుస్తకాలు చదివేవారు. ఇది ఆయనకు తండ్రి ద్వారా వచ్చిన అలవాటు. అతని అభిమాన రచయితలు: టి.ఇ.లారెన్స్, చార్లెస్ డికెన్స్, చార్లెట్ బ్రాంటే, రుద్యార్డ్ కిప్లింగ్ తదితరులు.

**- యామిజాల జగదీశ్**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



గతంలో వాయిదా వేసిన పనులు పూర్తి చేస్తారు. వ్యవసాయదారులకు బాగుంటుంది. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి సామాన్యం. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు.సంతానాభివృద్ధి గురించి చేసే చర్చలు సత్ఫలితాలనిస్తాయి. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. శుభ వార్తలు వింటారు.

## వృషభం



భాగస్వామ్య వ్యాపారులకు లాభాలుంటాయి. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. చోర భయం పొంచి వుంది, విలువైన వస్తువుల పట్ల జాగ్రత్తలు పాటించండి. దీర్ఘకాలిక సమస్యలు వారాంతంలో పరిష్కారమవుతాయి. ఆకస్మిక ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఉద్యోగులకు పని వత్తిడి అధికం, సంయమనంతో వ్యవహరించండి. తీర్థ యాత్రలు చేస్తారు.

## మిథునం



వ్యాపారులకు కొన్ని చోట్ల అనుకోని ధన నష్టం. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. కళాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. అకారణంగా ఆందోళనకు లోనవుతారు. సాహస నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలనం. గృహ రుణాలు తీర్చి ఊరట పొందుతారు. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు.

## కర్కాటం



ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. అనుకోని ఖర్చులు వచ్చి పడతాయి, సంయమనంతో వ్యవహరించండి. ఆరోగ్యం కుదుట పడుతుంది. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. శుభ కార్య చర్చలు ఫలించే సూచనలున్నాయి. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఏది జరిగినా మన మంచికే అన్న ధోరణి అలవడుతుంది.

## సింహం



చోర భయం పొంచి వుంది కనుక విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. స్త్రీలకు శుభ యోగం. వాక్చాతుర్యంతో ముఖ్యమైన పనులు చక్కబెట్టుకుంటారు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభిస్తారు. అన్ని వ్యవహారాల్లో ఆచి తూచి వ్యవహరిస్తారు. ధన యోగం.

## కన్య



సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. ఎదురు చూస్తున్న ముఖ్య సమాచారం తెలుసుకుంటారు. చిన్ననాటి మిత్రులకు సహాయ సహకారాలు అందిస్తారు. స్త్రీలు స్థిరాస్తులు కొనుగోలు చేస్తారు. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. శత్రువులు మిత్రులవుతారు. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. గృహ రుణాలు వారాంతంలో మంజూరవుతాయి.

## తుల



వృథా కాలక్షేపం మంచిది కాదు. విదేశాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు. సంఘంలో కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు. దంపతుల మధ్య అన్యోన్యత ఏర్పడుతుంది. శత్రువులు మిత్రులవుతారు. దేశాంతర ప్రయాణం చేస్తారు. స్త్రీలకు ఆరోగ్య సమస్యలుంటాయి. బాల్య మిత్రులకు సహాయ సహకారాలు అందిస్తారు. కోర్టు వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి.

## వృశ్చికం



వ్యాపారులకు అనుకోని చోట స్వల్ప నష్ట సూచనలున్నాయి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు. సామాజిక సంఘర్షణకు లోనవుతారు. వాక్చాతుర్యంతో ముఖ్యమైన పనులు చక్కబెట్టుకుంటారు. వృత్తి రంగాల్లో వున్న వారికి పోటీ ఏర్పడుతుంది. శుభ కార్యాలకు హాజరవుతారు. శారీరక, మానసిక అలసటకు లోనవుతారు. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. చర్చలు ఫలిస్తాయి.

## ధనుస్సు



తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది. ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది. వ్యాపారులు సమయస్ఫూర్తితో వ్యవహరించి అధిక లాభాలు గడిస్తారు. కళాకారులకు ఆర్థిక ప్రోత్సాహం లభిస్తుంది. వృథా సంచారం చేస్తారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. విద్యారంగంలో పని చేసేవారికి బదిలీ సూచనలున్నాయి. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి సామాన్యం.

## మకరం



దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వాయిదా పడతాయి. వివాదాలకు దూరంగా ఉండడం శ్రేయస్కరం. అనాథాశ్రమాలకు మీ శక్త్యానుసారం చేయూతనిస్తారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. కుటుంబంలో మనస్పర్థలకు ఆస్కారం. చిరు వ్యాపారులకు ఆశించిన లాభాలు ఉండకపోవచ్చు.

## కుంభం



నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. ఆరోగ్య సమస్యలుంటాయి. తీర్థ యాత్రలు చేయాలన్న కోరిక తీరుతుంది. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. స్త్రీలకు స్థిరాస్తులు లభిస్తాయి. ఆకస్మిక సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. వ్యాపారులకు తీవ్ర పోటీ ఏర్పడుతుంది.

## మీనం



ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలనం. గృహ రుణాలు మంజూరవుతాయి. కుటుంబంలో వివాదాలకు అవకాశం. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. వివాదాలు సమసిపోతాయి. వృద్ధాశ్రమాలకు ఆర్థిక చేయూతనిస్తారు. వ్యవసాయదారులకు బాగుంటుంది. వృత్తి కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. ప్రభుత్వ సంబంధమైన పనులు పూర్తి అవుతాయి. ప్రముఖులతో పరిచయం.

# సరదాగా కాసేపు నవ్వుకోండి

## పదే ఉన్నాయిగా!

షావుకారు: డజను మామిడిపళ్లకు డబ్బులు తీసుకుని పది పండ్లే ఇచ్చారేంటి?
పండ్ల వ్యాపారి: మీ షాపులో డజను అగ్గిపెట్టెలు కొంటే ఆ డబ్బాలో పది పెట్టెలే వున్నాయిగా!
షావుకారు: ఆ...!!

– **కె.విశ్వేశ్వరరావు,** మద్రిపాలెం, విశాఖపట్నం



## పెళ్లి చేసుకుంటాను

కూతురు ఎయిడ్స్: అమ్మా! నేను ప్రేమించినతన్నే పెళ్లి చేసుకుంటాను.
తల్లి ఎయిడ్స్: నువ్వెన్నిసార్లు అడిగినా నా సమాధానం ఒకటే. ఆ పురుష కరోనాను నువ్వు పెళ్లి చేసుకోవటానికి నేను ఒప్పుకోను. వాళ్లొచ్చిన తరువాత అందరూ మనల్ని మరిచిపోయారు.

## నష్టపోయానురా!

నందనరావు: గుళ్లో పెళ్లి చేసుకుంటే అంతా లాభమే అన్నావు కదా! జీవితం ఎలా వుంది ఇప్పుడు?
సుబ్బారావు: నష్టపోయానురా!
నందనరావు: ఏమైంది?
సుబ్బారావు: కానుకలు హుండీలో మాత్రమే వేయండి అని రాసుంటే అందరూ దాంట్లోనే వేసారురా!
నందనరావు: ఆ........!!

## బెల్టు

రాజారావు: సుబ్బారావ్! మీ వాడు కరాటే శిక్షణ పొందాడు కదా! ఏ బెల్టు సాధించాడు?
సుబ్బారావు: తోలుబెల్టు.
రాజారావు: నోరు వెళ్లబెట్టాడు.


## హెల్మెట్

పోలీసు: ఏమండీ! మీరొక్కరే వెళ్తూ ఇంకో హెల్మెట్ పట్టుకెళ్తున్నారు?
కమల: ఆఫీసుకెళ్లిన తరువాత చీర మారుస్తాను. దానికి సరిపోయే హెల్మెట్ ఇది. ఆఫీసు నుంచి వచ్చేటప్పుడు వేసుకోవడానికి.

## పనిమనిషి

భార్య: నేను చచ్చిపోతే మళ్లీ పెళ్లి చేసుకుంటారా? ప్లీజ్ చెప్పండి!
భర్త: పెళ్లెందుకే? పనిమనిషి రంగి వుండగా! అని ఠక్కున నాలుక కరచుకున్నాడు.

– **వైదా ఈశ్వరరావు,** విశాఖపట్నం




## జాగ్రత్తగా చూసాను

తల్లి: చిట్టీ! పిల్లి పాలు తాగుతుంది, జాగ్రత్తగా చూడమన్నాను కదా! చూడలేదా?
చిట్టి: చూసానమ్మా!
తల్లి: మరి పిల్లి పాలన్నీ తాగేసి వెళ్లింది. పిల్లిని ఎందుకు వెళ్లగొట్టలేదు?
చిట్టి: నువ్వు చూడన్నావుగానీ పిల్లిని వెళ్లగొట్టమనలేదుగా!
తల్లి: ఆ...!

## సీక్రెట్

తాత: చింటూ! పోస్ట్ చేయమని కవరు ఇచ్చాను కదా! పోస్టు చేసావా?
చింటు: చేసాను తాతయ్యా!
తాత: అడ్రసు కవరు మీద రాసి, పోస్టు చేయమని అడ్రస్ కూడా ఇచ్చా. కవరు మీద అడ్రస్ రాసావా?
చింటు: లేదు..
తాత: అయ్యో! రాయకపోవట మేమిట్రా? ఎందుకు రాయలేదు?
చింటు: ఇది సీక్రెట్.. ఎవరికీ తెలియకూడదన్నావు కదా! అందుకే రాయలేదు.
తాత: ఆ...!

## నక్కతోక తొక్కా

రామారావు: ఇంటర్వ్యూలో నేనే నెగ్గుతాను. ఉద్యోగం నాకే గ్యారంటీగా వస్తుంది.
రాజారావు: అంత నమ్మకంగా ఎలా చెప్పగలవు?
రామారావు: అడవికి వెళ్లి నక్కతోక తొచ్చి వచ్చాను.
రాజారావు: అయితే?!
రామారావు: నక్కతోక తొక్కి వచ్చినవారిని అదృష్టం వరిస్తుంటారుగా!
రాజారావు: ఆ..!?!?

**- మా.శ్రీ.రాజు,** పాల్వంచ

## జోక్స్‌కు ఆహ్వానం

మీరు పంపే జోక్స్ హాస్యాన్ని పండించేలా ఉండాలి.
కాపీ జోక్స్‌ను పంపకండి. చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, హైదరాబాద్-500 080
sunmagvaartha@gmail.com



**చిత్రభారతి**

**వాశిరాజు ప్రకాశం**

'ఆమనీ పాడవే హాయిగా మూగవైపోకు ఈ వేళ.. రాలేటి పూవుల గంధాలతో' అంటూ 'గీతాంజలి' చిత్రంలో నవ తరం

**నింగీ.. నేల ముద్దాడే ఆ కవితలో నుంచి మచ్చుకు పది ఎంపిక చేయవలసిందని అడిగితే- ఆ మహా సాహితీ సాగరంలో ఎక్కడి నుండి వెదుకుతాం! ఎన్నెని అన్వేషిస్తాం? కారణం.. వేటూరివారిని రాయమని అడిగితే అన్నీ బావుంటాయి.**



# మనసు పరవశింపచేసిన వేటూరి పరిమళాలు

తరచుగా గుర్తుకు వచ్చే ఒక వెన్నెల జల్లు.. 'వేణువై వచ్చాను భువనానికి, గాలినై పోతాను గగనానికి' అంతటి రసరంజని సాహితీ పరిమళాలను ఆయన తన వాక్యాలలో మాతృదేవోభవ, పితృదే వోభవ, ఆచార్య దేవోభవ అన్న అక్షర హృదయవీణ మోగించటం ఆయనకే తెలుసు. నిజానికి ఆయన సినీ సాహితీ పుంగవులే అయినా ఆయన రాయని రచన, పలకరించని పరిమళాలు కావాలంటే మనం వెదుక్కోవసి వచ్చిందే. 'సప్తపది' చిత్రంలో కె.వి.మహదేవన్, జానకిగారు ఆలపించిన ఓ మధుర గీతం 'నీ కులమూ ఏదంటే గోకులము నవ్వింది.. మాధవుడు యాదవుడు మా కులమే లెమ్మంది' అంటూ అవలీలగా ఆయన రాశారంటే అందులో ఒక విజ్ఞతా ప్రపంచాన్ని మనం చూస్తాం. ఇంకా 'ఆది నుంచి ఆకాశం మూగది.. అనాదిగా తల్లి ధరణి మూగది, నడుమ వచ్చిన మబ్బులే ఉరుముతాయి' కారణం ఈ నడిమంత్రపు మనుషులకే మాటలు, ఈ చాదసపు కథలు, కథా కమామిషు! ఈ వరుసలో మనం మరువలేనిది, శాశ్వతంగా నిలిచిపోయిన మరో గీతం 'దొరకునా ఇటువంటి సేవ.. నీ పద రాజీవముల చేరు నిర్వాణ సోపాన మధిరోహణము..' ఎంతటి భారీకవిత! గుండెలను తట్టి తట్టి పలకరించిన ఈ భావ వైవిధ్యం అప్పటికీ యిప్పటికీ మనకు దొరకునా యిటువంటి సేవ.

నాయకుడు ఒక పాటలో తనకు తెలిసిన వెన్నెల మబ్బులను ఆ హీరో మన గుండెల్లో విసిరి జల్లటం ఎప్పటికీ మరిచిపోలేం.

ఇక ఆయన పూర్వ చరిత్ర ఎంత రమణీయంగా వుందో తెలుసుకుంటే మనసు పరవశించి, మళ్లీ మళ్లీ తలచుకుంటాం. వేటూరివారి తరతరాల కుటుంబం సాహితీ క్షేత్రం. ఆయన రచనా ప్రస్థానం పాత్రికేయ వృత్తితో మొదలయింది. పాత్రికేయ వృత్తిలో ఆయన ఘనాపాటే అయినా దృష్టి అటు మరల్చి, యింకా తన బాధ్యతలు వున్నాయని తపన పడేవారు. కారణం.. వేటూరి వారి కుటుంబానికి అసాధార ణమైన పేరున్నది. ప్రతి చెట్టూ సంపెం గలు యివ్వగలిగిన పూదోట ఆ స్వర్గసీమ.

అందుకేనేమో సుందరరామమూర్తి తన తొలి అడుగులా తొలి వెన్నెల జల్లులా పత్రికల వృత్తిలోకి వెళ్లారు. ఆ రోజుల్లో ఖ్యాతినెక్కిన ఆంధ్రపత్రిక, ఆంధ్ర జనత మొదలయిన అగ్రశ్రేణి పత్రికల్లో పని చేశారు. ఆయనకు రిపోర్టింగు పట్ల మక్కువ. ఆయన జీవితంలో మరచిపో లేని సంఘటనలు అనంతం, అపారం. ఆంధ్ర పత్రికలో పని చేసిన రోజుల్లో ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పర్యటన కవర్ చేసే అవకాశం లభించినపుడు 'ఇదో పూర్వ జన్మ సుకృతం' అనుకున్నారు. అదే సమయంలో ఆదివారం సంచికల్లో విశ్వనాథ సత్యనారాయణ సాహితీ వైభవం గురించి అనర్గళంగా రాసి, పత్రికలకు వన్నె తెచ్చిన వేటూరి నిజంగా సవ్యసాచి.

పాటల రచన ఆరంభం నుండీ సినిమా పరిశ్రమ ఆయన్ను కన్నబిడ్డలా చేరదీ సింది. ఒక రోజుకు ఐదు పాటలు రాసిన ఉదంతాలున్నాయి. మరోవైపు గాయక శిరోమణి కూడా ఏకబిగిన ఎనిమిది పాటలు పాడినట్లు సంగీత చరిత్ర చెప్తోంది.


ఒకరోజు విజయ వాహినీ గార్డెన్స్‌లో ఒక గంట వ్యవధి కాల్‌షీట్ సమయం మిగి లింది. ఆ మాట వేటూరికి తెలిసింది. సంగీత దర్శకులు చక్రవర్తి వేటూరి వెంటనే 'గురూజీ స్వర రచన చేయండి, నేను సాహితీ ముగిస్తాను ఈ గంటలో యిద్దరం కలిసి మంచి పాట తయారు చేద్దాం' అన్నారేగానీ మరునాటికి వాయిదా వేయలేదు.

ఆమని కోయిలై గానం చేసింది. ప్రకృతి అందాలు విరబూసాయి. ఆ పాట కోసమే తాను పుట్టానన్న రీతిన నవ కథానాయ కుడు నాగార్జున ఆలపిస్తూ వుంటే ప్రకృతి మాత వీరందరినీ దీవిం చింది.

అందుకే ఆయన భాషలో చెప్పా లంటే 'కృషి వుంటే మనుషులు రుషులవు తారు.. మహాపురుషులవుతారు" అని. అలాంటి పండిత శిఖరం వేటూరి సుంద రరామమూర్తి గురించి ఎంత రాసినా తక్కువే! అదే జీవన సాఫల్యం! ◆

# ఈ వారం కా'ర్ట్యూన్స్'


ఎక్కడో చూసినట్లుంది... ఫేస్ బుక్కా... ఇన్స్టాగ్రామా..?!
Zakir...


దస్తర్ అయిపోయిందా బ్రో...!!
Zakir...


క్యాష్ విత్‌డ్రాయల్ ఛార్జెస్ కట్టేళ్లు...!!
మేనేజర్
BANK
Zakir...



భూలోక స్వర్గాన్ని తలపించే 'అట్లాంటిస్' హోటల్ దుబాయ్‌లో ఉంది. ఈ లగ్జరీ హోటల్‌కు బోలెడన్ని ప్రత్యేకతలు వున్నాయి. ఒకేసారి అరవై ఐదు వేల మందికి ఆతిథ్యం ఇవ్వగల ఈ హోటల్‌లో ప్రపంచంలోనే అతి పెద్ద వాటర్ పార్క్ ఉంది.





